# శతావధాన భాగ్యోదయము

**దక్షిణామ్నాయ శృంగేరి శంకరాచార్య శ్రీశారదాపీఠాధీశ్వరులు,**
**జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి వారి,**
**జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి వారి**
**అనుగ్రహాశీస్సులతో**



శతావధాని శతధృతి, శతావధాన శరచ్చంద్ర

## గన్నవరం లలితాదిత్య

# శతావధానము

'దర్శనమ్' ఆధ్యాత్మిక మాసపత్రిక నిర్వహణలో
తెలంగాణ సారస్వత పరిషత్, హైదరాబాదులో
2022, జూన్ 28, 29, 30 తేదీలలో

# శతావధాన భాగ్యోదయము

(లలితాదిత్య భాగ్యనగర శతావధానము)

'దర్శనమ్' ఆధ్యాత్మిక మాసపత్రిక ప్రచురణ
ప్రచురణ : జూన్ 2024
ప్రతులు : 1000
వెల : అమూల్యం

ప్రాప్తిస్థానం
మరుమాముల వెంకటరమణ శర్మ
సంపాదకులు,
దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
శ్రీరామ సిద్ధాంతి భవనం
29-105/4/1, న్యూ విద్యానగర్ కాలనీ
నేరేడ్ మెట్, సికింద్రాబాద్ - 500056
ఫోన్ : 9441015469

డి.టి.పి : కంది శంకరయ్య, వరంగల్
కవర్ డిజైన్ : విట్టుబాబు, హైదరాబాదు
ముద్రణ : సాయి తిరుమల ప్రింటర్స్, హైదరాబాదు

श्री श्री जगद्गुरु शङ्कराचार्य महासंस्थानम्,
दक्षिणाम्नाय श्रीशारदापीठम्, शृङ्गेरी

Sri Sri Jagadguru Shankaracharya Mahasamsthanam
Dakshinamnaya Sri Sharada Peetham, Sringeri - 577 139.

[illegible]

[illegible]


దర్శనమ్
శ్రీ గన్నవరం లలితాదిత్య
శతావధానం

# భారతీకరుణాపాత్రుడు లలితాదిత్య

పాశ్చాత్య దేశంలో ప్రభవించిన లలితాదిత్య రూపంలోని మన వారసత్వ అవధాన విద్య మళ్లీ ఈ తరాన్ని ఉత్తేజితం చేస్తూ భాగ్యనగరం వేదికగా ఆహూతులను తన్మయులను చేసింది.

ఇప్పుడు శృంగేరీ జగద్గురువుల సన్నిధిలో మరోమారు లలితాదిత్య శతావధాన భారతీ సేవగా వెల్లి విరియనున్నది.

యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడి భారతీయ సంప్రదాయాలను మంట గలుపుతున్నారన్న అపప్రథ మూట కట్టుకున్న ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాలో పుట్టి, అమెరికా పౌరుడై ఉండి, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదువుతూనే మన భారతీయ సంస్కృతిని నిలబెట్టడంకోసం ఎంతో కృషి చేస్తూ అవధాన విద్యను దశదిశలా చాటుతున్న 'శతావధాని' లలితాదిత్య భరతజాతి గర్వించదగిన వ్యక్తుల్లో ఒకరయ్యారు. ప్రస్తుతం ఆదిశంకరాద్వైత విద్యాలయంలో పాండితీ మండితమైన పారంపరిక సారస్వత విద్యతో పాటుగా శృంగేరీ జగద్గురువులు పరమ పూజ్య భారతీ తీర్థ మహాస్వామి వారి వద్ద ప్రత్యక్షంగా తర్క వేదాంత శాస్త్రాధ్యయనం చేస్తూ శారదాంబ అనుగ్రహంతో సంస్కృతాంధ్ర భాషలలో "శతావధానం" చేస్తుండడం ఎందరికో స్ఫూర్తిదాయకం.

"నూటికొక్కడు చక్కని ధాటి కల్గి
సరస కవనమ్ము చెప్పెడి చతురుడుండు
అట్టి వారలలో వేయికమరు నొకడు
శతవధానాదికమ్మును సలుపు జాణ"

విద్యావంతులు ఎందరున్నా అందులో సరసంగా కవిత్వం చెప్పగల పండితులు అతి కొద్దిమంది మాత్రమే ఉంటారు. అలాంటి వెయ్యిమంది పండితులలో ఒక్కడు మాత్రమే అవధానిగా ఉంటారన్న తిరుపతి వేంకట కవుల పద్యాన్ని నిజం చేస్తూ లలితాదిత్య కోటి కొక్కడుగా వెలుగొందుతున్నాడనడంలో అతిశయోక్తి లేదు.

దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాస పత్రిక ఆధ్వర్యవంలో గన్నవరం లలితాదిత్య చేసిన శతావధానం కొమ్ములు తిరిగిన పండితులను సైతం ఆశ్చర్యపరుస్తూ ఆనందడోలికల్లో ముంచెత్తింది.

ఉద్యోగ రీత్యా అమెరికా లోని ఆస్టిన్ లో నివసిస్తూ సంస్కృత భాషలో పాండిత్యం పెంపొందించుకొని మనసంస్కృతినీ సంస్కృతాన్ని, ముఖ్యంగా భగవద్గీతను అమెరికాలోని బాలబాలికలకు బోధిస్తున్న గన్నవరం మారుతి, శైలజల తపఃఫలం లలితాదిత్య. 2000 సంవత్సరంలో అమెరికా న్యూయార్క్ లో పుట్టి పెరిగిన లలితాదిత్య ఏరోనాటిక్స్ ఇంజనీరింగ్ చేస్తూనే స్వయంకృషితో సంస్కృతాంధ్ర భాషలలో విశేష ప్రతిభను చాటుకున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు 'దర్శనాలంకార' బ్రహ్మశ్రీ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, బ్రహ్మశ్రీ వెంపటి కుటుంబ శాస్త్రి, బ్రహ్మశ్రీ చిఱ్ఱాపూరి పద్మనాభ శర్మ, బ్రహ్మశ్రీ దోర్బల ప్రభాకర శర్మ, బ్రహ్మశ్రీ ధూళిపాళ మహాదేవమణి, బ్రహ్మశ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారలవంటి భారతదేశంలోని గీర్వాణాంధ్ర పండితుల శిక్షణతో చిన్ననాటనే అధ్యాత్మ విద్యను, ఛందోవ్యాకరణ కవిత్వ పాటవాలను పెంపొందించుకున్నాడు.

2016లో రాజమండ్రిలో ఆ వెంటనే దర్శనమ్ ఆధ్వర్యంలో భాగ్యనగరంలో రవీంద్రభారతి వేదికపై ద్విగుణిత సంస్కృతాంధ్ర అష్టావధానం అత్యద్భుతంగా ప్రదర్శించి జేజేలందుకున్నాడు. దేశవిదేశాల్లో 19 అష్టావధానాలు మూడు శతావధానాలు చేసి శహభాష్ అనిపించుకొన్నాడు. వందలాది ప్రవచనాలతో అనేక సంస్కృతాంధ్ర రచనలతో విశేషంగా సాహిత్య వరివస్య గావిస్తున్న లలితాదిత్యకు అపార తపస్సిద్ధులు, అద్వైత తత్త్వ విద్యానిధులైన, శారదాంబా స్వరూపులైన శృంగేరి జగద్గురువుల అంతేవాసిత్వం లభించడం పూర్వజన్మ సంస్కారయోగం.

వీటిలో భాగ్యనగరంలో జరిగిన ద్విగుణితాష్టావధానం, మూడు అష్టావధానాలు, ఒక శతావధానం దర్శనమ్ ఆధ్వర్యంలోనే జరగడం విశేషం.

అమెరికా ఆస్టిన్ నుండి ఆత్మీయ సోదరుడు వెంకట్ ఇంద్రగంటి ఓ శుభముహూర్తాన ఫోన్ చేసి లలితాదిత్య గురించి చెప్పి భాగ్యనగరంలో అవధానం ఏర్పాటు చేయాలని కోరారు. అంతకుముందే ఎన్నో అవధానాలను, అవధాన సప్తాహాలను జరిపించిన దర్శనమ్ లలిత్ సంస్కృతాంధ్ర ద్విగుణిత అష్టావధానాన్ని జనవరి 16, 2019 న రవీంద్రభారతి వేదికపై సుప్రసిద్ధ కవి పండిత మండలితో ఘనంగా నిర్వహించింది. వేదికపై నలుగురు శతావధానుల, ఎందరో కవి పండితుల సమక్షంలో నాన్యతోదర్శనీయంగా అవధానం జరిగింది.

అదేవిధంగా దర్శనమ్ నిర్వహణలో 2019 ఆగస్టు 18న నల్లకుంట శృంగేరీ శంకరమఠంలో, 2020 జనవరి 3వ తేదీన సైనికపురి శృంగేరీ శంకరమఠంలో జరిగిన లలితాదిత్య అష్టావధానాలు మధురఘట్టాలు.

2022 జూన్ నెల 28,29,30 తేదీలలో తెలంగాణ సారస్వత పరిషత్తు భవనంలో మూడు రోజుల పాటు సరస సాహిత్య రసామృత ఖేలగా జరిగిన లలిత్ సంపూర్ణ శతావధానం దర్శనమ్ నిర్వహించిన సాహిత్య కార్యక్రమాల పరంపరలో తలమానికంగా నిలుస్తుంది. ఈ శతావధానానికి అక్షరాకృతి ఈ కృతి. ఈ శతావధానంలో పాల్గొన్న ప్రాశ్నికవర్యులకు, సభాధ్యక్షులకు, సభాసంచాలకులకు, కార్యకర్తలుగా నిలిచిన ఆత్మీయులకు, పారిషదులైన రసజ్ఞ సాహితీ మూర్తులకు కృతజ్ఞతాభివందనములు.

"శతావధాన భాగ్యోదయము"గా రూపొందుతున్న ఈ గ్రంథానికి పద్యలేఖకులైన శ్రీమతి ఆరవల్లి శ్రీదేవి, శ్రీమతి సరస్వతీ రామశర్మ గారలకు, అందమైన ముఖచిత్రాన్ని సంతరించి పెట్టిన శ్రీ విట్టుబాబు గారికి, అక్షర శిల్పి 'పద్యవశంకరులు' శ్రీ కంది శంకరయ్య గారికి దర్శనమ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతుంది.

దక్షిణామ్నాయ శృంగేరి శ్రీ శారదా పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాసన్నిధానం వారు సన్యాసాశ్రమం స్వీకరించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైభవంగా జరుగుతున్న "సువర్ణభారతి మహోత్సవం" సందర్భంగా ఉభయ జగద్గురువుల ఆశీరనుగ్రహంతో శృంగేరీ నరసింహవనంలో ఈనెల (2024, జూన్ 10,11,12 తేదీలలో) సంపూర్ణ సంస్కృతాంధ్ర శతావధానం చేయనుండడం, ఈ సాహితీ సవనాన్ని దర్శనమ్ నిర్వహించే అవకాశం కలిగించడం జగద్గురువుల ఆశీరనుగ్రహ ఫలమే.

ఈ అక్షర క్రతువులో జగద్గురువుల కరకమలాల మీదుగా ఆవిష్కృత మౌతుండడం మరొక భాగ్యం. శృంగేరీ పీఠంలో జరుగుతున్న లలితాదిత్య శతావధానంలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరూ ధన్యులే. అందరూ మహనీయులే! మీ అందరికీ వందనాలు!

**మరుమాముల దత్తాత్రేయ శర్మ**

**మరుమాముల వేంకటరమణ శర్మ**

# అక్షరాక్షతలు

పద్యే పద్యే పరమకరుణా ప్లావితా శారదాయాః
శ్లోకే శ్లోకే రణితగుణితే నూపురే చంద్రమౌళేః ।
వాక్యే వాక్యే పరిగతఘటితాః వేదవేదాంతమూలాః
ధాఃఙః ధాత్వర్థో జయతి లలితాదిత్యభవ్యావధానే ॥

లలితాదిత్యుని జైత్రయాత్రల కథల్ శ్లాఘించెగా కల్హణుం
డెలమిన్ రాజతరంగిణిన్పలికినట్లిందున్ జగజ్జేతగా
కలితానేకమహావధానరచనాగాండీవివై శృంగశై
లలతాంతాద్భుతకావ్యముల్ నుడువుమీ లాలిత్యమాదిత్యమై.

ఎవరితడన్న కొమ్ముమల నెక్కినయమ్మకు ముద్దుబిడ్డ గ
న్నవరపుటింటిదివ్వెయయి నాలుగు ప్రక్కల వెల్గుపంచు లే
తవెలుగుప్రొద్దుకుఙ్ఞనెడదన్ నెఱినూర్గదురాట గెల్పునం
దు విరివి మెప్పుదీవెనలతో నుడిసేసలు చల్లి మెచ్చెదన్.

తత్త్వము చెప్పు వర్ణనలు, దత్తపదుల్, విలువౌ సమస్యలున్
సత్త్వము చూప నాశువుల సత్యవికాసము వెల్గుచూడ వి
ద్వత్త్వము నూఱుతీరులుగ వైభవమౌ లలితాదితేయు ను
ద్యత్త్వర నాశిషంబుల శుభావహసంస్తుతు లిచ్చి మెచ్చెదన్

కుదురాటగండ

**పాలపర్తి శ్యామలానంద ప్రసాద్**

# శతావధాన భాగ్యోదయము

## ప్రారంభ పద్యములు

మ. కరుణాసాగరవీచికల్ మను సుమగ్రామప్రసూవాటికల్
చిరవిద్యామయకీలికల్ భవగదచ్ఛేదక్షమల్ మూలికల్
స్మరలీలాగృహకేళికల్ త్వదమలేక్షాకోణదృఙ్మాలికల్
సిరిసింగారపు డోలికల్ గొలిచెదన్ శృంగాచలాధీశ్వరీ!

సీ. సర్వత్ర కలవంచుఁ జాటి చాటక మున్నె
త్రిజగంబు నిండుట రిత్త యగును
పదియేండ్లు లేనట్టి పసిబాలు రక్షింప
నుగ్రరూపము దాల్చుటుట్టిదగును
ఘోరాగ్నులన్ జగద్గురుమూర్తి రగులంగ
వానిఁ బ్రోచిన మాట వట్టిదగును
కాపాలికుండు శంకరశీర్షమునుఁ గోర
వాని వ్రచ్చిన మాట వ్యర్థమగును

తే.గీ. ఇపుడు నాముందు రూపొంది యేలకుంటి
వేని పాతపురాణంబు లేలనయ్య
తీక్ష్ణనఖరాగ్రనిక్షుణ్ణదితిజరంహ
చేరరా పరబ్రహ్మ లక్ష్మీనృసింహ!

శా. కర్ణాటమ్ముల సహ్యశైలముల శృంగక్ష్మాభృదీశమ్మునన్
స్వర్ణావిష్కృతశారదాలయసమీపప్రేంఖదుత్తుంగతుం
గార్ణోబిందుమిలన్నృసింహవనమధ్యంబందు దీపింతు రే
కార్ణాధిష్ఠితులై జగద్గురులు సాయంప్రాతరేకాకృతిన్.

సీ. శృంగారశృంగాద్రిశృంగశృంగాటక
క్షేత్రపవిత్రనక్షత్రరాజు
వైయాసికవిహాయసీయానసంస్థాన
మాధ్యందినాదిత్యమండలమ్ము
శారదాపరతనూస్పర్శనానన్యస
ద్వ్యాఖ్యానసింహాసనాధిరోహి
ప్రత్యర్థిదుష్కృత్యయాత్యయద్విపఘటో
చ్చాటనప్రౌఢపంచాననమ్ము

తే.గీ. అది మహారాజరాజవంద్యాంఘ్రికమల
కోమలతరమ్మునది జగద్గురుమహస్సు
అద్వయబ్రహ్మతాదాత్మ్యముద్వరమ్ము
కారుణికకటాక్షముల నన్ గాంచుఁ గాత!

కం. మెండుగ విద్యాబుద్ధులు
దండిగ శ్రద్ధయును భక్తి దాల్చఁగఁ జేయన్
బండిన నా తలిదండ్రుల
నెండల మారని గొడుగుల నెల్లడఁ గొలుతున్.

ఆ.వె. పద్యమన్న చాలు పరవశించెడి వారు
కమ్మనైన మదినిఁ గలుగు వారు
మతిని మేటి వారు మహదేవమణి వారు
వారికంజలింతు గౌరవమున.

కం. దిక్కరులున్ బ్రాక్పణులున్
ప్రక్కృతశాస్త్రోచ్చయులును సంస్కృతిధరులున్
అక్కరములెఱుఁగువారును
నిక్కంబుగఁ గలుఁగు సభకు నిండు నమస్సుల్.

తే.గీ. శతవధానదుస్తారవిస్తారజలధి
దాఁటఁ జేసెడి సత్కర్ణధారయగుచు
ధార ధారణ నా జిహ్వఁ దనరఁ జేయు
నలువరాణి నా గుండెల నాటుకొనుచు.

# నిషిద్ధాక్షరి

**1. కంది శంకరయ్య గారు**

**శతావధానం విజయయవంతంగా కొనసాగాలని అమ్మవారి ప్రార్థన**

కం. మా దండ నీ పథంబై
మోదశ్రీ నింపి, పద్యముం జూడ భవ
త్పాదములు దీపికలుగా
నాదరణముఁ జూపుమమ్మ ఆర్యోక్తిమయీ!

**2. ఆచార్య ఫణీంద్ర గారు**

**రవిగాంచనిచో కవి గాంచును - ఆదిత్యుడే కవి ఐతే**

కం. రేపే శ్రీవచమై పై
మాపే యితియై ప్రసన్నమంజూక్తుల్ సో
ద్దీపిత కిరణావళియై
యా పూష రచించు భువనమన్ నాటకమున్.

**3. చింతా రామకృష్ణారావు గారు**

**తణికెళ్ళ భరణి గారి గురించి**

కం. చిహ్నంబుల్ జేబల్కుల్
వహ్నీక్షున్ లోగొలుపు ప్రవక్తగ తేజో–
నిహ్నుతరసముల భరణిగ,
జాహ్నవిగా శివుని యాట సాగును నోటన్.

# తెలుఁగు సమస్యలు

**1. అరవల్లి శ్రీదేవి గారు**

**వెన్నెల గ్రుమ్మరించెఁ గడుఁ బ్రేమను భానుఁడు నేలఁ జేరుచున్**

ఉ. ఉన్నతమైన తూర్పుగిరినుండి జగమ్మును నిద్రలేపి సం
పన్నము సేసి పద్మినుల పంక్తిని విప్రకృతార్ఘ్యజాత యో
జన్నిరసించి యంధతమసమ్ము, రచించియుఁ గాలబుద్ధి ది
వ్వెన్ నెల గ్రుమ్మరించెఁ గడుఁ బ్రేమను భానుఁడు నేలఁ జేరుచున్.

**2. డా. ఒజ్జల శరత్ బాబు గారు**

**నరసింహాకృతి నుద్భవించె కలి నానాభీతిఁ గల్గించఁగన్.**

మ. సరసీజాప్తకులాంబుధీందుచరితన్ సాఫల్యమున్ నింపు సుం
దరుఁడై ప్రోచియు లక్ష్మణాదులను త్రేతాకాలమందెంతయున్,
మరలన్ భాగ్యపురిన్ జనుల్ గొలువ కర్మన్ఘాటునందున్న వా
నరసింహాకృతి నుద్భవించె కలినానాభీతిఁ గల్గించఁగన్.

**3. అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి గారు**

**స్త్రీలోలుండగు వీరరాఘవునిఁ గీర్తింపన్ దగున్ పండితుల్**

శా. లీలన్ రామకథన్ బఠించునెడ మర్మీభూతగూఢార్థముల్
శీలింపన్ వలె ధర్మమున్ దెలిసి తాచ్ఛీల్యప్రధానంబుగన్
గోలన్ గూలిన రావణున్ ఘనునిగాఁ గొన్నన్ దురాత్ముండు తా
స్త్రీలోలుండగు, వీరరాఘవునిఁ గీర్తింపన్ దగున్ పండితుల్.

**4. కటకం వెంకటరామశర్మ గారు**

**అమృతముఁ బంచి విష్ణువసురాళినిఁ బ్రోచె చిరాయువొందఁగన్**

చం. సమరఁపుఁ బూర్వరంగమున సాకెను వైరికనిష్ఠసోదరున్
విమతతనూజుఁ బ్రోచెనఁట వీరనృకేసరిరూపధారియై
క్రమణమునన్ శిరమ్ముపయిఁ గాలును నిల్పె, స్వపాదభక్తియౌ
అమృతముఁ బంచి విష్ణువసురాళినిఁ బ్రోచె చిరాయువొందఁగన్.

**5. ధనికొండ రవిప్రసాద్ గారు**

**తిక్కననున్ వరించెఁ గద తిక్కలపోరి యిదేమిలొల్లియో**

ఉ. చక్కగ వ్రాసె నన్నయట శారదరాత్రి మనోజ్ఞ శోభలన్
చెక్క నరణ్య గోష్ఠులనుఁ జిక్కగ నెఱ్ఱన చిక్కినంతలో
రక్కసులై మధాంధులగు రాజుల పోరది దక్కెనక్కటా
తిక్కననున్ వరించెఁ గద తిక్కలపోరి యిదేమిలొల్లియో.

**6. నలవోలు నర్సింహారెడ్డి గారు**

**అమ్మను నమ్మి కొల్చి మరియాదనుఁ జేసినఁ బాపమబ్బెడిన్**

ఉ. సమ్మతి శాంతి దాంతిముఖసాధనలెల్ల సమాహరించి మో –
క్షమ్మునుఁ బొందఁగోరి వికసత్ఫలకోటిని వీడుచున్ విరా
గమ్మునుఁ బూనకే భవులు కామముచే "తను వేను – ఏను దే
హ"మ్మను నమ్మి కొల్చి మరియాదనుఁ జేసినఁ బాపమబ్బెడిన్.

**7. మాచవోలు శ్రీధర్ రావు గారు**

**పూరణ సేయలేననుచు పోయె వధానివరేణ్యు డల్కతోన్**

ఉ. శ్రీరమణీమనోహరుని చెల్వపు శ్వాసలు వేదపర్ణముల్
సారవిచారకారణవచస్సుల సూరులు మార్చఁ బోరు, ప్రా
గ్ధారగవచ్చు పాఠముల తత్స్వరవర్ణములుజ్జగించుచోఁ
బూరణ సేయలేననుచు పోయె వధానివరేణ్యుడల్కతోన్.

**8. వెలగపూడి భారతి గారు**

**వారిధి చేర వచ్చెనఁట వాహిని పెన్ననుఁ బెండ్లి యాడఁగన్**

ఉ. నీరకరంబులన్ నురుగు నిక్కిన మల్లెల మాలఁ దాల్చి వి
స్తారమహాబ్ధి రత్నమయసంపద జూచి భ్రమించి వేగమై
పారుచు సంగమేచ్ఛమెయి వచ్చెడి యా ధునిఁ జూచి పల్కె నా
వారిధి "చేరవచ్చెనఁట వాహిని పెన్ నను పెండ్లి యాడఁగన్"

**9. వెలుదండ సత్యనారాయణ గారు**

**బారె శరణ్యమయ్యెఁ గద పండితపామరులెల్లవారికిన్**

ఉ. సారసనేత్రుఁడున్, జలజసంభవుఁడున్, సువసిష్ఠమౌని, సొం–
పారెడి శక్తి, తత్సుతుఁడు నా శుకుఁడున్, శుభగౌడపాదుఁడున్,
సారెకు వారి శిష్యుఁడును, శంకరుఁడున్ గలయట్టి యొజ్జపుం
బారె శరణ్యమయ్యెఁ గద పండితపామరులెల్లవారికిన్.

**10. విరించి గారు**

**వాలినిఁ గొల్చు వారలకుఁ బాపభయమ్మది పోవునెంతయున్**

ఉ. పాలన తత్పరత్వగుణభావవశంవదచిత్తవృత్తి లీ
లాలయుఁడౌచుఁ గంఠమున నా గరళమ్మునుఁ గొన్న వేళ త
త్కాళిమ నింద్రనీలరుచిగా ధరియించిన యమ్మహాలిక
జ్వాలినిఁ గొల్చువారలకు పాపభయమ్మది పోవునెంతయున్.

**11. కాటేపల్లి లక్ష్మీ నరసింహాశర్మ గారు**

**కనుపాపల్ గను తల్లిదండ్రుల సదా కన్బొమ్మలై రెప్పలై**

మ. జనసృష్టిస్థితిముఖ్యలీలల నిజాజ్ఞాదానదక్షంబులై
కనులన్ మూయఁగ లోకనాశభయసక్తస్వాంతలై ప్రేమమై
మునుపున్ గల్పపు కర్మ సర్దుటకు బాముల్ పుట్ట ప్రాగ్దంపతుల్
కనుపాపల్ గను తల్లిదండ్రుల సదా కన్బొమ్మలై రెప్పలై.

**12. ఉప్పులధడియం భరత్ శర్మ గారు**

**యేరా మామా కుశక్తి హితమున్ సుఖమున్**

కం. మారారిచాపఖండన
పారావారప్రబంధపారీణా లో
కారాధ్యా యిడుమీవివి
యే, రామా! మాకు శక్తి హితమున్ సుఖమున్.

**13. శేషంబట్ల వెంకటగిరి గారు**

**దొంగకు మ్రొక్కినన్ నవనిధుల్ లభియించు శుభంబు సేకురున్**

ఉ. సంగడులైన వానరుల చల్లల వెన్నలు గ్రుమ్మరించి, మా
తంగపు దంతముల్ పెరకి తస్కరుఁడౌచును, గన్యకావళిన్
గ్రుంగక స్వీకరించి, మన గుండెలు దోఁచెడి మాయగాఁడు నా
దొంగకు మ్రొక్కినన్ నవనిధుల్ లభియించు శుభంబు సేకురున్.

**14. V.V. సత్యప్రసాద్ గారు**

**ధైర్యము చేయుటే యభిమతంబగు కృష్ణుని మానసంబునన్**

ఉ. ఆర్యధరిత్రిపైన నడయాడిన వన్నెల చిన్నవాఁడు, సౌ
కర్యము కొద్ది సూకరముగా ధరణిన్ నిలఁబెట్టువాఁడు, నౌ
దార్యము మీర ముష్టిపచదాసుని కల్మిని ముంచువాఁడునై
ధైర్యము చేయుటే యభిమతంబగు కృష్ణుని మానసంబునన్.

**15. శాస్త్రుల రఘురామశర్మ గారు**

**కలలవి కల్లలౌ నమెరికా కనినంత నిదేమి చిత్రమో**

చం. వలవల యేడ్చునట్టి తన వారల వీడి విదేశమేఁగఁగాఁ
దళతళాడు పశ్చిమపుఁ దళ్కులు చంచలమంచు నేరకే
తెలతెలవారు తూరుపున దీప్తిని వీడి స్వసంస్కృతిన్ విడన్
కలలవి కల్లలౌ నమెరికా కనినంత నిదేమి చిత్రమో?

16 D.C. నర్సింలు గారు

**ముక్కును ముక్కుతో పలుక ముక్కుకుఁ గోపము ముంచుకొచ్చెడిన్**

ఉ. ముక్కుకు పైన నయ్యదియె మూర్ఖుల వాక్కుల నాలకించఁగా
చక్కగఁ బ్రాతిశాఖ్యగతశాబ్దవిధానవిహీనజిహ్వతో
టక్కరియౌచు ముక్కువడి డాయఁగ పండితులున్ సహింతురే
ముక్కును ముక్కుతోఁ బలుక ముక్కుకుఁ గోపము ముంచుకొచ్చెడిన్.

17. సురభి శంకరశర్మ గారు

**పులులున్ మేకలు నేకమయ్యెఁ గదరా పొత్తంచు చాటించుచున్**

మ. పొలుపన్ గొఱ్ఱె కసాయి నమ్మినటు పల్ భోగంబులాశించుచున్
గల విద్యార్థుల మంద తోలుకొని రక్తంబూడ్చి తజ్జీవనం
బులు వేడ్కన్ ఫలహారమట్లు భుజియించున్ శిక్షణాకేంద్రముల్
పులులున్ మేకలునేకమయ్యెఁ గదరా పొత్తంచు చాటించుచున్.

18. బట్టు విజయ్ కుమార్ గారు

**రాముఁడు రావణున్ గెలిచె లంకకు రాజగు సీతమెచ్చఁగన్**

ఉ. గాముగ లంక దేహమగుఁ, గన్గొన రాఘవుడంతరాత్మయౌ,
కామిని సీత బుద్ధి, వెదుకన్ జనునొజ్జయె గాలిపట్టి, ని
ష్కామము బమ్మకోలయగు, సామియె గెల్చిన రామరాజ్యమౌ
"రాముఁడు రావణున్ గెలిచె లంకకు రాజగు సీతమెచ్చఁగన్"

19 . ఆదరాసుపల్లి శ్యామ్ మోహన్ గారు

**మానము వోయెనంచు నొక మానిని సంతసమొంది పొంగెఁగా**

ఉ. కానక ధార్తరాష్ట్రులు ప్రగర్వితకృత్యములాచరింపఁగా
మానవతీవతంససుకుమారియు ధీరయు యాజ్ఞసేని యు
ద్ధాన తదూరుభంగరతి తక్కక చూచియు రాజరాజస
న్మానము వోయెనంచునొక మానిని సంతసమొంది పొంగెఁగా.

**20. శ్రీ దోరవేటి చెన్నయ్య గారు**

**శుభకైలాససమంబు కాయికమటంచున్ దెల్పెనీజాతికిన్**

మ. అభవుల్గా దిగమ్రింగి క్ష్వేళమును జ్యోత్స్నాసారమున్ బంచుచుం
డ భవానీసమయోకళత్రమును మేనందట్లు యిర్కించి యే
విభవంబుల్ వరియింపకే వరళి చూపెన్ భర్గతాదాత్మ్యమున్
శుభకైలాససమంబు కాయికమటంచున్ తెల్పెనీజాతికిన్.

# సంస్కృత సమస్యలు

**21. చిటితోటి విజయ్ కుమార్ గారు**

**కఠోరశాపోఽపి వరో బభూవ**

उपजाति तिरस्कृता येन कपिध्वजेन
सा चोर्वशी तं हि शशाप रुष्टा ।
अज्ञातवासे कृतषण्डभावः
कठोरशापोऽपि वरो बभूव ॥

**22. విరివెంటి సుబ్రహ్మణ్యం గారు**

**కృపా కృపాణేన హతా హుతార్చిషః**

वंशस्थ सवेषु हिंसां विनिवार्य सौगताः
श्रुतिं निराचक्रुरहो विजल्पकाः ।
तदुद्वचस्स्थेन निरस्तयाज्ञिकाः
कृपाकृपाणेन हता हुतार्चिषः ॥

23. ఆచార్య వేణు గారు

జ్వలితదహనమధ్యే పఙ్కజాన్యుల్లసన్తే

मालिनी

धवलजलदमाला सान्ध्यलौहित्यरञ्जत्
विविधविपुलरूपा नो दरीदृश्यते सा ।
उपमितिमनुयाता भावुकानां पुरस्तात्
ज्वलितदहनमध्ये पङ्कजान्युल्लसन्ते ॥

24. శ్రీ విద్యారణ్యస్వామి వారు

మసకదశనమధ్యే దన్తినః సఞ్చరన్తి

मालिनी

मनुजनिकरनष्टे रक्तवन्यप्रदेशे
कलुषितबहुतोये बन्धनाद्भीतिमन्तः ।
रदनदळनशङ्काकर्शिताः भूतिपीडा
मसकदशनमध्ये दन्तिनः सञ्चरन्ति ॥

# తెలుఁగు దత్తపదులు

**1. పండరి రాధాకృష్ణ గారు**

**రోదన, సాధన, బోధన, వేదన - భారతార్థం - స్వేచ్ఛా వృత్తం.**

చం. యుధిని శ్రమింపగా వలయు నొప్పునె యెందు నరణ్యరోదనల్
బుధహితసాధనంబులవి పూనఁగ మాధవసారథిత్వమై
మధురనివేదనంబులగు మాన్యుల కర్మములీశ్వరార్పణముల్
ప్రథలను పొందనయ్యవియ భారతబోధన భారతమ్మునన్.

**2. శ్రీలక్ష్మి గారు**

**ఆకు, చక్క, కాసు, సున్నం - అవధానవిశిష్టత - స్వేచ్ఛాఛందం.**

తే.గీ. మలఁపుఁ దలఁపు గమికి మారాకు హత్తించి
యెందు బోకనీక యెదను ధృతిని
దివిరి తనను తాను ధీవికాసున్నమ్మి
చక్కవలయుఁ గైత చక్కరవలె.

**3. ముద్దు రాజయ్య గారు**

**ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు - రామాయణార్థం - స్వేచ్ఛావృత్తం**

చం. ఇనకులమందునన్ బొడమి యీక్షితినెల్ల పవిత్ర సేయఁగా
వనములఁ బట్టి భీమసురవైరుల పించమడంచి లీలమై
యనితరధర్మరాజపరమావధిఁ జూపఁగ సద్యశంబు న
ర్జునమగునట్లు రాముఁడు రజోలవలేశజహచ్చరిత్రుఁడై.

**4. డా. సంగనభట్ల నర్సయ్య గారు**

**లలిత, జ్వలిత ,పలిత ,కలిత - తెలంగాణ లేదా తెలుగు ప్రశస్తి - స్వేచ్ఛావృత్తం.**

చం. లలితకళావధూవిపులలాస్యపు వేది పురాతనాప్రభా
కలితసురాలయంబులును క్ష్మాపతిదుర్గములన్ సుశిల్పముల్
జ్వలితగుహప్రతాపవికచద్భుజయోధుల వీరగాథలిం
పలి తరుణావృతాంబుజ మహాసుభగత్వము తెల్గువారిదే.

(గాథలు + ఇంపు + అలి)

**5. గొడవర్తి సంధ్యారాణి గారు**

**సమత, మమత, జనత, ఘనత - భారతీయ ఆధ్యాత్మిక వైభవం - స్వేచ్ఛాఛందం.**

కం. ఘనతాత్త్వికకల్లోలిని
జనతాపనివారణైకసత్కల్పకమున్
గణితాత్మమతాలంబన
మన భాసమతాత్మికంపు మాయలఁ ద్రోలున్.

**6. సాధువైష్ణవి**

**లలితా, దిత్య, సహస్ర, వధాని - మీ అవధానం గురించి - తేటగీతి.**

తే.గీ. అండ లలితాపరాత్మిక యక్కటికము
దిత్యపత్యభావంబులఁ ద్రెంచివైచి
తతసహస్రారమైన సుదర్శనముగ
నెగడుటకు భండబలవధా నీవె దిక్కు.

**7. ముదిగొండ విశ్వేశ్వర శాస్త్రి గారు**

**నేను, నీవు, వాడు, వీడు - అన్యార్థంలో - నేటి వివాహవ్యవస్థ - స్వేచ్ఛాఛందం.**

తే.గీ. వాడుకొన్నంత దాకనే వరుఁడు వాఁడు!
వీడుకో ల్బల్కుదాకనే వీరు వధువు!
కాననే నుడివెద నేను కచ్చితముగ
నీవు పోనీవు దాంపత్యనీతి సుంత.

**8. శిఖా గణేశ్ గౌడ్ గారు**

**పుణ్య, శ్రవణ, కీర్తన, అర్చన - ఈ కార్యక్రమ శ్రీకారం చుట్టిన మరుమాముల సోదరుల గురించి - స్వేచ్ఛాఛందం.**

కం. నైపుణ్యమ్ము కరమ్ముగఁ
జూపుచు వైశ్రవణునీవి శుద్ధమనస్కుల్
ఏపున కీర్తనయులుగా (కీర ఇవ ఆచరతీతి కీర్)
శ్రీపతిపాదార్చ నమ్మి సిద్ధుల చెందున్.

**9. M.D సుబ్రహ్మణ్యం గారు**

**గుట్టు, రట్టు, బెట్టు, బొట్టు - రామాయణార్థం - స్వేచ్ఛాఛందం.**

కం. గుట్టుగ రాముఁడు సీతకు
బొట్టును పెట్టిన కథలనుఁ బూనిన కపికిన్
దిట్టకుఁ బెట్టుట కలదే
రట్టుగ వారట్టుల పరిరంభణమయ్యెన్.

**10. డా. జంధ్యాల సుబ్బలక్ష్మి గారు**

**రాజ్యము, భోజ్యము, సేద్యము, ఖాద్యము - యుద్ధానంతర ప్రశాంతజీవనం**

ఉ. భోజ్యము గాఁగ సంపదకు పోరును సల్పెడి భూమినేలు వా
రాజ్యము పోయఁగావలయు నంతట శాంతిసుయజ్ఞవహ్నికిన్
సజ్యులుగా సుఖాద్యతనసంఘమునందునఁ బుష్టిఁ బెంచఁగా
త్యాజ్యముగా గణింపవలె దౌష్ట్యము ధాత్రికి సేద్యమిచ్చుచున్.

**11. బోర్పట్ల విరాట్ స్వరూప్ గారు**

**భక్తి, యుక్తి, శక్తి, ముక్తి - హనుమంతుని సముద్రలంఘనం - ఉత్పలమాల.**

ఉ. భర్తృవియుక్తిమై వగచు భామిని జాడనుఁ బట్టి తీయఁగాఁ
గర్తృకశక్తి రామునిది కాండము నేనని యెంచె సత్సుధో
ద్ధర్తృకవైనతేయగతిఁ దత్కపికోటికి ధైర్యముక్తిచే
నార్తినిఁ బారద్రోలెను విహాయసగామిగ భీవిభక్తిమై.

**12 . త్రిగుళ్ళ కృష్ణమూర్తి గారు**

**కరుణ , అరుణ, భరణ, వరుణ - అమెరికా భారత అవధాన మైత్రి బంధం - స్వేచ్ఛాఛందం.**

తే.గీ. వరుణనిలయంబు గలుప నుభయజనులను
తరుణుఁడైనను నుదయంపుటరుణుఁడగుచుఁ
బరఁగు యువకులు సత్సభాభరణములుగ
దైవకరుణచే సాగు వధానమైత్రి.

**13. డా. కోటా లక్ష్మీ అన్నపూర్ణ గారు**

**గుడి, బడి, నుడి, ఒడి - భారతీయ సంస్కృతి వైభవం - స్వేచ్ఛాఛందం.**

తే.గీ. రాబడికి పోవకుంట వరమ్ము మనకు
కొంత నుడిగిన ధర్మమున్ గూర్పవలయు
ఒడిసి పట్టిన నారెంటి నొక్కడించి
నిగ్గు డించక నెగడెదు నేల మనది.

**14. డా.చీదెళ్ళ సీతాలక్ష్మీ గారు**

**వారి, భేరి, నారి, మారి - నృసింహస్వామి వైభవం - స్వేచ్ఛావృత్తం.**

కం. వారిజనేత్రుఁడయైన వ
నారికణంబులు రగులగ నక్షులయందున్
ధీరుని కౌమారికయుతు
భేరిని మ్రోగించి ప్రోచె వీరనృహరియే.

**15. పరిమె వేంకట సత్యమూర్తి గారు**

**రక్ష, కక్ష, శిక్ష, భిక్ష వనవాసంలో సీత కష్టం - స్వేచ్ఛావృత్తం.**

ఉ. శిక్షసుమిత్రసూతినిటు ఛీత్కృతి సేసిన దానికంచు సం
రక్షణ సేయువాఁడు రఘురాముఁడటంచును నమ్మి, "దైత్యకుం
భిక్షపణైకసింహుఁడిఁకఁ గూల్చును నీ జలదుర్గమోరి ఘూ
కక్షణదాచరా" యనుచు గర్జన సేసెను సీత యేకయై.

**16. మంచినీళ్ళ సరస్వతీ రామశర్మ గారు**

**మృదువు, పదును, కదనం, సదనం - గాయత్రీ అమ్మవారి మెడలో చంపకమాల.**

చం. సదనము సాంధ్యభానుకరసప్తకగర్భితమండలంబు నీ
కదనము మామకీనజపయత్నపురస్కృత మంత్రమాలికల్
మృదువుగ మూడుపాదముల మించుచు దాఁగు చతుర్థపంక్తి కా
స్పదు నుతియించు కౌశికుని భావమునందలి తల్లి మ్రొక్కెదన్.

**17. డా. పి. లలిత వాణి గారు**

**శ్రీచక్రము, మేరుచక్రము, భూచక్రము, విష్ణుచక్రము - లలితా స్తుతి - స్వేచ్ఛాఛందం.**

తే.గీ. కుండలినివైతి భూచక్రకోటియందు
సాగె పీయుషమై మేరుచక్రమందు
సత్త్వమోక్షణప్రభవిష్ణుచక్రమందు
లోక వృతవైన శ్రీచక్రలోలవమ్మ!

**18. కండ్లకుంట లక్ష్మీ నర్సింహాచారి గారు**

**సైన్, కాట్, టాన్, కాస్ - అర్జునుని స్వైరవిహారం - శార్దూలం.**

శా. కక్షన్ కాటును వేయ బూను ఫణి తాఁకన్ బోదు తచ్ఛీర్షమున్
దీక్షన్ జిత్తపుటానులిప్తముగ సందీపించె గీతోక్తులున్
రూక్షాస్త్రాళివికాసుఁడై ఘనధనుర్దుర్దాంతవిక్రాంతుఁడై
యక్షౌహిన్యధినేత ఫల్గునుఁడు వాసైనట్టి కీర్తిన్ గనెన్.

**19. సింగీతం నర్సింహారావు గారు**

**అనిమ, గరిమ, గరిమ, లఘిమ - అమ్మవారి స్తుతి - మత్తేభం.**

మ. మహి మత్తెక్కిన దైత్యవర్గముల సమ్మర్దించి సింహాశ్వయై
విహృతుల్ దోర్లఘిమప్రయుక్తములుగాఁ బ్రేక్షించ దేవౌఘముల్
సుహృదుల్ ప్రమంద సురారిగర్వమణిమన్ శుష్కంబు గావించి భ
ర్గహరిక్రోధజ దుర్గ శక్తిగరిమన్ గర్మార్థమై జుష్టయౌ.

20. K.V.N ఆచార్య గారు

**రయము, భయము, జయము, నయము - అవధాని సిద్ధుడా?సాధ్యుడా? మీ పరిష్కారం - చంపకమాల.**

చం. నయమున రక్తితోడుతను నశ్వరసాహితి నేర్చి కూర్చి ది
గ్జయమును సల్పగావలయు సాధనదార్ఢ్యము తన్నిధానమై
భయమును వీడగావలయు వాక్పతి రక్షణ సేయుచుండుటే
రయమును వాఙ్మయమ్ముకు విరాజిలునట్టి వధానివాక్కులన్.

## సంస్కృత దత్తపదులు

21. ఎర్రంశెట్టి ఉమామహేశ్వర రావు

**ఐన్ద్ర, చాన్ద్ర, తన్ద్ర, మన్ద్ర - సంస్కృతభాష అధ్యయనవైశిష్టం - స్రగ్ధర**

तन्द्रावैधूननोद्यद्बहुगुणगुणितं नित्य चैतन्यपात्रं
चान्द्रज्योत्स्नोपमेयस्फुटरसरसितं चित्रविद्याकलत्रम् ।
ऐन्द्रस्वाराज्यभोज्यद्रुतफलफलितं पालिताशेषलोकं
मन्द्रं गाम्भीर्यसान्द्रं मनुमधुमधुरं संस्कृतं पाठयध्वम् ॥

22. బుడిగె వెంకట్ గారు

**భారతీ, వారధీ, వారిణీ, హారతీ - భారతీవైభవం**

वारिणी दुष्टबुद्धीनां शुद्धदेहा रतीङ्गिता ।
सा सुपर्वारिधीमोहचतुरा भारती गतिः ॥

23. రాజగోపాలాచారి గారు

**శ్రవణం, భాషణం, పఠనం, లేఖనం - ప్రస్తుతావధానం - మంద్రాక్రాంత**

गैर्वाण्यान्ध्रीकवनविलसद्भाषणं कर्णभूषं
यस्मिन् पद्ये हि सकृदुदिते लेखनं स्वर्गपुष्पम् ।
द्राग्वक्रोक्तिश्रवणमनलं साधुसूक्तिप्रयुक्तं
चालम्ब्याद्य स्वकृतिपठनं साधनं तद्बुधानम् ॥

23. జి.ఎం. రామశర్మ గారు

**రామ, రామ, రామ, రామ - 'సచామర రమావాణీ సవ్యదక్షిణ సేవితాం' అర్థం - పంచచామరం**

जपापरागभासुरा मनस्विनीनिषेविता
पुराणमन्दुरामनोज्ञसद्दयाननेडिता ।
तपस्विचित्तमन्दिरा मरन्दषोडशार्णगा
वचोरमाकरस्थचामरामलाश्रिता ॥

# తెలుఁగు వర్ణనలు

**1. కడయింటి కృష్ణమూర్తి గారు**

**శాంతమనోగతి - ఆటవెలఁది**

ఆ.వె. రోమపాదుఁడైన లోకంబులేలెడి
దశరథుండునైన తండ్రి యగుచు
చెలువ మీర ఋష్యశృంగుని పత్నియే
తతసుగుణ నితాంతదాంత శాంత.

**2. ఉప్పులపాటి కుసుమకుమారి గారు**

**కాబోయే వధువు గురించి మనస్థితిని - మానినీవృత్తం.**

మానిని ఇందరు చూడఁగ నిట్టి సభాస్థలి నేమని చెప్పుదు దాని వడిన్
మందముగానది కర్ణమునందున మాటున జెప్పిన మాటయగున్
ఇందువతంసుఁడు నద్రిభవేశ్వరుఁడేమని యానతి సేతురొకో
అందిన తోడనె పద్యము చెప్పెద నందెడి దాఁకను వేచుడికన్.

**3. కిడాంబి రామస్వామి గారు**

**పూర్వ భాగ్యనగరానికి ఇప్పుడున్న దానికి తేడాలు - చంపకమాల.**

చం. సెలవులలోన వచ్చితిని చెల్లెలనక్కల నన్నదమ్ములన్
గలకలలాడునట్టి పురి కమ్మలనాఁడొక బాల్యలీలగాఁ
గలియుట కష్టమయ్యెనిటఁ గార్యాపు భారము మీరుచుండగా
వలసిన యంతలోఁ గలిసి వర్ధిలుచుంటిమి బంధుభావనన్.

**4. మాచవోలు నాగలక్ష్మి గారు**

**అడవిలో జంతువులు ఆహారం దొరకక నగరానికి రావడం - పర్యావరణ అవగాహన**

**- మత్తకోకిల.**

మ.కో. భూములేలెడి జంతురాజము బోనులోపలి సింహమై
సామజంబులు గ్రామందున సాగి చిక్కుకుపోయెనే
తాము నూత్ననివాసమెందును తారసిల్లగఁ జూడఁగా
నీ మనుష్యులు నుంచబోరు మహీరుహంబొకటైననున్.

**5. గంగాపురం యజ్ఞభగవాన్ గారు**

**నేటి యువత మనస్థితి - మత్తకోకిల**

మ.కో. ముందు ముందుగ మేలునౌనని ముందుచూపులు సూడఁగా
మందు మందుగ మారిపోయెను మందగించెను భావియున్
మందమందగ సాగిపోయిరి మందబుద్ధుల చేతనే
యిందు చిక్కిన బాలురైనను వృద్ధులైనను నొక్కటే.

**6. కామేశ్వర రావు**

**వర్ణనాతీతుఁడైన పరమాత్మ వర్ణన - కందము**

కం. తన్మాత్రంబులకందక
సన్మాత్రము గాఁగ మెరసి సర్వుల మదిలోఁ
గన్మరుగగునవ్వాఁడే
తన్మాత్రుఁడటంచుఁ బలుక తగునే యెందున్.

**7. డా. మండల స్వామి గారు**

**కరోనా గురించి - మత్తేభము**

మ. గదమన్నన్ మది గద్గదంబగును లోకశ్రేణిలో నెల్లెడన్
జెదరున్ ధైర్యమునెల్లవారలకు సంశీర్ణంబుగా దేహముల్
బొదువన్ భావిసమాజభద్రతకు నిర్మూలించి యీవ్యాధులన్
జదివించన్ వలె పాఠశాలలను స్వాచ్ఛ్యప్రౌఢిమన్ పెంచఁగన్.

**8. సుసర్ల సుధన్వ**

**దారిద్ర్యం - విద్యావవస్థలకు సామ్యం - కందం.**

కం. ఎవ్వఁడు కాలు కదల్పఁడు
నెవ్వఁడు దారియ్యబోఁడు నీటికి పోకన్
నవ్వుదురేడ్చుదురిచ్చట
నవ్వులపాలయ్యె బడులు నడిచెడి పథముల్.

**9. జి. మమత గారు**

**అత్తగారి ఇంట్లో అడుగు పెట్టే కోడలి మనస్సు - ఆటవెలఁది.**

ఆ.వె. అత్తవారియింట నడుగు మోపినయంత
తలపు తలపు భిన్నతను వహింపఁ
జేయు పనులు తాను చేయించు పనులును
నుప్పతిల్లె నువిద యూహలందు.

**10. కాసుల శ్యామ్ సుందర్ గారు**

**పాశ్చాత్య వ్యామోహం, భారతీయ సంస్కృతి - కందం.**

కం. బొట్టుకు నామము వెట్టిరి
పెట్టిరిగ తిలోదకములు పితృతర్పణకున్
బెట్టిరి తూరుపుదండము
తుట్టతుదకు భరతభూమి తూరుపు విధికిన్.

**11. మరుమాముల వెంటకరమణ శర్మ గారు**

**నరసింహ స్వామి నేటి సమాజంలో దుర్మార్గం చూస్తే - శార్దూలం**

శా. గోటన్ పోయెడి రీతి బోయె నఖముల్ గొడ్డళ్ళగా మారఁగాఁ
బోటాపోటిగ నీ సమాజమున దుర్బుద్ధుల్ సమీక్షించఁగా
నాటోపంబున స్తంభమందు వెడలున్ హర్యక్షవక్త్రుండు బా
హాటమ్మై నిజగర్జనస్ఫురణ నంహశ్శ్రేణిసంహారియై.

**12. బుద్ధోజీ చౌదరి గారు**

**గురుశిష్య సంబంధం నేటి సమాజంలో - కందం.**

కం. చదువులయందలి మర్మము
కుదురుగఁ జదివించునట్టి గురువులు కరువై
చదువరులు కూడ కరువై
మెదడులు కరువయ్యెనకట మేదినిలోనన్.

**13. నల్లాన్ చక్రవర్తుల సాహిత్ గారు**

**యక్షప్రశ్నలు - ఉత్పలమాల**

ఉ. ఇందు గతాగతాసువుల నెన్నఁగఁ బోవరు పండితోత్తముల్
చందిరవంశవర్యుడలసత్వము వీడి తదీయ పృచ్ఛలన్
సుందరసద్వినీతుఁడయి సూటిగఁ జెప్పఁగ నుత్తరంబులన్
బొందెను ధర్మనందనుఁడు పొందగ నల్గురి జీవితమ్ములన్.

**14. మచ్చ అనూరాధ గారు**

**పీ.వీ. నరసింహ రావు రాజనీతి - శార్దూలం**

శా. కాపాడెన్ భరతోర్వరానిధి విపత్కారంబులన్ ప్రాజ్ఞుఁడై
చూపించెన్ దగు మాటలందుఁ బొదుపున్ శుశ్రూషితాచార్యుఁడై
యీ పాండిత్యము చేతనే జనపురోవృద్ధిన్ బ్రసాదించి 'జై
జై పీ వీ నరసింహరా' వను జనశ్లాఘాతతిన్ బొందెడిన్.

**15. పంతుల విట్టుబాబు గారు**

**తనది కాని పాత్రలో కవి ఉంటే మనస్స్థితి - ఆటవెలఁది.**

ఆ.వె. తెలియునంటినేనది యెక తీరు బాధ
తెలియకుంటినేనది యొక తీరు బాధ
తేల్చకుండక యెందు సందిగ్ధముగను
తెలిపి తెలుపకనుండుటే తెలివి యగును.

**16. బంకుపల్లి రమేశ్ గారు**

**గాయత్రీ పంచముఖ వర్ణన - కందం.**

కం. తెల్లగ తోచును దయయే
యల్లరి చేతలకుఁ గెంపు ననువై పసిఁడిన్
ఎల్లెడ నీలము సాజమె
పుల్లంబులు తల్లి కనులు ముక్తాఫలముల్.

**17. తనికెళ్ల శేషవెంటాద్రి గారు**

**అశోకవనంలో సీత బాధ - ఉత్పలమాల.**

ఉ. శోకవనంబు తోఁచెగ నశోకవనమ్మునలోన బైటయున్
నే కులకాంతనయ్యు నిట నీచనిశాచరబంధనంబునన్
సాఁకెడి వారు లేక నృపచంద్రునిఁ గోరుచు వేచియుంటినే
ప్రాకటహాటకైణమును రామునిఁ దెమ్మన పెద్దదోసమౌ.

**18. వాసుదేవరావు గారు**

**అవధానం చూస్తూ ఉన్న మీ తల్లిదండ్రుల అనుభూతి - కందం.**

కం. పారాయణము పరాయణ
మై రాజేశ్వరి పదంబులాలంబనమై
శ్రీరాముఁడు రక్షణమై
పేరాసలతోడఁ జూచు పితరుల్ వీటన్.

**19. ముత్యంపేట గాయత్రి గారు**

**అవధానం చూస్తూ ఉన్న మీతల్లి అనుభూతి - కందం**

కం. అన్నము తినెనో లేదో
పన్నుగఁ బద్యములఁ బంచెఁ బ్రాశ్నికతతికిన్
దిన్నగఁ గూరుచునుండెనొ
కన్నయ్య యటంచుఁ దల్లి గాంచును నన్నున్.

20. రాయప్రోలు పద్మజ గారు

**తిరుపతి వేంకట కవుల వర్ణన - కందం.**

కం. ఉద్యోగవిజయనాటక
సద్యోగముచేత కీర్తి సంపాదించన్
విద్యుద్వేగపరిష్కృత
పద్యమ్ములఁ బలుకు జంట భారతి సుతులౌ.

## సంస్కృత వర్ణనలు

1. ఇంద్రకంటి వెంకట నర్సింహా శర్మ గారు

**నేటి విద్యార్థులను నిద్ర లేపడం నాటి కుంభకర్ణుని నిద్ర లేపిన దానితో సమానమని వర్ణించండి.**

नवीना कुम्भकर्णा ये नोत्थास्यन्ति प्रभातके ।
निशाचराश्च ये चान्ये तेभ्यो नित्यं नमो नमः ॥

2. సాధన నరసింహాచారి గారు

**భారతీతీర్థ స్వామి వారి వర్ణన - మాలిని.**

विमलवचनजालैर्दीपितब्रह्मतत्त्वं
कमलसदृशहस्तैः राद्धराजार्धमौलिम् ।
विबुधविनुतवाक्यै श्शास्त्रकान्तारसिंहं
मनसि नमत नित्यं भारतीतीर्थपादम् ॥

3. ముత్యంపేట గౌరీశంకర శర్మ అవధాని గారు

**హిమాలయవర్ణన - ఇంద్రవజ్ర**

अस्त्युत्तरस्यां दिशि सैनिकात्मा
दुर्गाधिपो नाम हिमालयाद्रिः ।
पूर्वापरं देशयुगं विगाह्य
स्थितः पृथिव्या इव रक्षवर्म ॥

4. ఆముదాల మురళి శతావధాని గారు

**విద్యావినయ సంపన్నే భావం - మందాక్రాంత**

विप्रे द्रोणे विबुधविनुते शन्तनोरात्मजाते
पाण्डोः पुत्रेष्वपि निजकुले तत्सुभद्रातनूजे ।
प्रादाद्योग्यं प्रकटितफलं तत्तदीयानुकूलं
निर्लिप्तो यो युधि विजयते मोक्षकारी मुरारिः ॥

# ఆశువులు (తెలుగు)

**1. తనికెళ్ళ భరణి గారు**

**కాళిదాసకృతశాకుంతలాంతర్గత "యాస్యత్యద్య శకుంతలేతి..." అనే శ్లోకానికి తెలుఁగు.**

తే.గీ. అడవి పుట్టింటి బిడ్డ నేఁడరుగుననుచు
కనులు జలదంబులై యెండెఁ గంఠసీమ
యిట్టి జడదారినైనట్టి యేను వగవ
నింటివారల బాములూహింపఁ గలమె?

**2. మైలవరపు సాయికృష్ణ గారు**

**శృంగేరీ గురుపరంపర వర్ణన**

కం. విద్యారణ్యవిరాజిత
మాద్యము శాంకరపరంపరావళి సద్వి
ద్యాద్యోతకబోధఘనము
సద్యోముక్త్యర్థినై ప్రశస్తి నుతింతున్.

**3. వనం జ్వాలా నృసింహారావు గారు**

**ఆంధ్రవాల్మీకి వాసుదాసు, బమ్మెర పోతన, కవిత్రయము;**

**ఆంధ్రభారతభాగవతరామయణముల ఆధునికప్రభావము**

కం. ఆంధ్రీకృతభాగవతము
సాంద్రంబుగ దిద్దు సుకవి సంస్కృతకవితా
చాంద్రినిఁ దెనుఁగున దించెను
మంద్రమ్ముగ వాసుదాసు మహితాత్ముఁడిలన్.

**4. శ్రీ వెలుదండ నిత్యానందరావు గారు**

**అమెరికాలో నదీసంకల్పము**

ఆ.వె. సంద్రమందు కలిసి సాగిన నదులార
పారుమింక మా నివాసముందు
ట్యాపునీరు మాకు నాకాశగంగయౌ
నాచమనము భద్రసూచనముగ.

**5. కొట్రా వెంకటనరసింహరావు గారు**

**గోవర్ధనోద్ధారణ**

ఆ.వె. గోసమూహములకుఁ గొండంత రక్షగా
నీరజాక్షుఁడచట నిలిచియుండెఁ
గారుమబ్బులంత కాలిమాకృతిఁ గాంచి
చుట్టమనుచుఁ దలచి సుంత తగ్గె.

**6. బ్రహ్మశ్రీ కొడకండ్ల రాధాకృష్ణ శర్మ గారు**

**నామసంకీర్తనవైశిష్ట్యవర్ణన**

కం. శివనామమొకటి చాలదె
యవనిన్ శ్రీమాతృనామమది యొకటుండున్
ఇవలనె నారాయణమును
భువిలో నివి జూడ మంత్రమూర్ధన్యంబుల్.

**7. శ్రీ కౌండిన్య తిలక్ గారు**

**క్రిమి (కొరోనా) రూపరాక్షసులను చంపుటకు శ్రీమహావిష్ణువు యొక్క పదకుండవ అవతారవర్ణన**

చం. కలవు కబంధహస్తములు గ్రన్నన బాహుల రక్తబీజముల్
కలవఁట లోకలోకభయకారణశీలములైన చేతముల్
గలవిట భూమి ముంచెడి వికస్వరవృత్తియు నిట్టి రోగమున్
దొలచఁగ నాదివైద్యుడిటఁ దోచును సూదుల మందు గ్రుచ్చుచున్.

**8. అష్టకాల రామమోహన శర్మ గారు**

**శృంగేరీగురువుల శ్రీచక్రార్చనను బతుకమ్మగా చూపుట**

కం. తొమ్మిది యావరణంబుల
నిమ్ముగఁ జరియించు తల్లి యిందరి బ్రతుకున్
గమ్మగఁ గ్రమ్ముటచే బతు
కమ్మగ బ్రతికించు మనల నాదిమసతియై.

**9. అష్టకాల విద్యాచరణ్ గారు**

**లలితాదిత్యస్ఫూర్తితో పద్యరచన చేయువారికి పద్యసందేశము**

కం. రసమను రసాయనమ్మునఁ
బ్రసృతాక్షరములను బొంది పరమవ్యోమో
ల్లసనముగ గొనిన శాస్త్రము
నసపెట్టక నేర్వవలయు నాఁడున్ నేఁడున్.

**10. మరుమాముల వేంకటరామ శర్మ గారు**

**ఓజోనే అమ్మవారుగా భావించి**

కం. ఆవరణంబులలోపల
జీవులకాధారమగుచుఁ జిత్రస్ఫూర్తిన్
బ్రావారకమై రోదసి
దేవియె యోజోనుమూర్తి తిన్నగ దాల్చెన్.

**11. ఘట్టి కృష్ణమూర్తి గారు**

**గొడ్డలికి తన కొమ్మనిచ్చి నరకబడిన వృక్షము**

తే.గీ. అడ్డకొమ్మల నరుకట యవసరంబు
కానఁ గైకొమ్ము నాదైన కరమదొకటి
యనుచు గొడ్డలిచే తాన యడుగఁ బడఁగ
నిడెను సదసద్వివిక్తి మహీరుహంబు.

**12. బాలసోమేశ్వర రావు గారు**

**బొట్టు యొక్క విశిష్టత**

కం. తిలకము కుంకుమ భస్మము
గలిగిన హరిచందనంబు గలిగిన నుదుటన్
గలుగును శుభములు పెల్లుగఁ
దలపగ మనదైన బొట్టు ధరియింపవలెన్.

**13. డా. కావ్యులపాటి నరసరాజు గారు**

**శృంగేరీజగద్గురువుల సన్నుతి**

కం. తుంగాతీరమునందున
సంగతమగు పీఠమందు సచ్చిద్రూపా
భంగోపనిషన్మననము
తుంగమ్ముగఁ జేయు గురుల తూర్ణమె కొలుతున్.

**14. గోగులపాటి కృష్ణమోహన్ గారు**

**మరుమాముల సోదరుల కార్యనిర్వహణ వైభవము**

కం. అవధానపు సప్తాహము
సవనమ్ములు వేదసభలు సలిపెడి వారై
జవసత్త్వంబులు గల్గిన
కవులన్ మరుమామభ్రాతృఘనుల నుతింతున్.

**15. తెల్లాప్రగడ రమాదేవి గారు**

**భారతీ తీర్థ స్వామి వారు మణిద్వీపస్వరూపులుగా**

కం. శృంగేరి మణిద్వీపము
తుంగానది యమృతజలధి తొలుతన్ విబుధుల్
రంగుగ దైవతగణములు
సంగతసోహమ్మతులును జగతీగురువుల్.

**16. కొత్తూరి భీమసేన మూర్తి గారు**

**సేంద్రియవ్యవసాయము**

ఆ.వె. ప్రకృతిసిద్ధమైన పంటలఁ బండించ
స్వాస్థ్యమొలయుచుండుఁ బ్రజలయందు
వికృతిసిద్ధమైన విధమున నాటగా
వికృతి యగుచు వద్లు వికటమగును.

**17. నారుమంచి అనంతకృష్ణ శర్మ గారు**

**శ్రీభారతీతీర్థస్వామివారిని నడిచే శ్రీచక్రముగా వర్ణన**

కం. అద్వైతమె భావమ్మగ
విద్వద్వాక్యార్థసభల విజ్ఞానములో
మృద్వీకబోధలందున
సాధ్వియు శారదయు వారు సత్యంబొకటే.

**18. ఆకారపు సుష్మ**

**యువతకు సందేశము**

కం. ధరణీసురగోశునముల
కరటిశ్వాపదబుధజనగణములలోనన్
మెరసిన సూత్రాత్మనుఁ గని
విరసత గల నడవడికను వీడఁగ వలయున్.

**19. డా. శంభుని కుమార్ గారు**

**వృద్ధుల పట్ల నిర్లక్ష్యం**

కం. అద్ధా యనునటు వాక్కిద
మిత్థంబని పల్కునట్టి వృద్ధుల మాటల్
శుద్ధములుగా గ్రహించి ని
బద్ధతతో సర్వజనులు పాటించవలెన్.

**20. నందం సాంబశివరావు గారు**

**విద్యాభ్యాసదశయందు ధనకాంక్షను తగ్గింపజేయు సందేశము**

కం. విద్యార్థులు విద్యార్తులు
సాధ్యమ్మను మరచినారు చదువులలోనన్
ఆద్యప్రయోజనమ్మను
సేద్యమ్మగఁ గొంటిరేని సిద్ధులు గలుగున్.

**21. అవధాని అవ్వసుల భానుప్రకాశ్ గారు**

**అప్రస్తుతప్రసంగుల వైభవము**

మ. అవధానంబున నవ్వునింపుటకుఁ దానావిర్భవంబందుచున్
అవధనాంబును భంగమున్ బరచ తనామారు ఫోన్ పట్టుచున్
లవలీపుష్పము దైవవిగ్రహముపై ప్రస్తారమౌ పద్ధతిన్
సవిశేషంబగు చాటుసూక్తి సభలో సత్యాత్ములై చల్లరే.

**22. అవధాని బోచ్కర్ ఓం ప్రకాశ్ గారు**

**సర్వశుక్లా సరస్వతీ - వర్ణన**

మ. కబరీబంధములోన నైల్యమును వీఁకన్ గప్పి దంతచ్ఛదా
నిబిడారుణ్యతిరోహతిన్ సలిపి ప్రాఙ్నిర్ణీతశుక్లత్వమున్
సబబున్ జేయుచు వాగ్వధూటి ముఖమన్ సౌధాంతరస్థాయియై
విబుధప్రార్థనలందు హాసలతికల్ ప్రేష్ఠమ్ములన్ బూచెడిన్.

**23. బోర్సెట్ల హనుమంతాచారి**

**వెంకటరమణ గారు మరియు దత్తాత్రేయశర్మ గారి శతావధాన నిర్వహణ ప్రశంస**

మ. పరిషత్తున్ నెలకొల్పినారు కవనస్వారాజ్యసౌధర్మమై
నెరపన్ గల్గిరి పిల్లపాపలకు నిందే సద్వధానక్రియన్
గురుభూతంబు శతావధానమున సద్గోష్ఠ్యాళి చేకూర్చ శాం
కరపీఠాధిపులైన సద్గురువరుల్ గావంగ సాధ్యంబగున్.

**24. మరుమాముల దత్తాత్రేయ శర్మ గారు**

**శతావధానమును పూర్తిచేసి ధారణకు సిద్ధమవుతున్న శతావధాని మనస్స్థితిని మానససరోవరముతో పోల్చు వర్ణన**

మ. శతపత్రప్రతిమానపృచ్ఛకవచస్స్వారస్యమై యోజనో
దృతసంచాలకనందికేశ్వరులు వాగ్ద్వారంబులన్ గావఁగా
నతిశైత్యంబును లేని మానససరస్సె యాత్మలింగేశ్వరా
ర్పితపద్యంబుల పూరణల్ సలిపెదన్ బ్రీణింప శ్రోత్రామరుల్.

**25. డా. లంకా రాధాకృష్ణ గారు**

**కాలవర్ణన**

శా. సర్వాధారము సర్వశాస్తయును దత్సత్యస్వరూపంబునై
గుర్వాదిగ్రహచాలనక్షమదయాంకూరమ్మునై యిందిరా
నిర్వాపంబయి లచ్చిదాల్పునయి మన్నీఁడౌచు జీవాళికిన్
బర్వున్ పౌరుషసాంయుగీనమనుచున్ భర్గాజ్ఞచే కాలమే.

**26. తుమ్మా బాలగంగాధర రావు గారు**

**అమరవీరులు ఆధునిక భారతమును చూస్తే వారి భావన**

కం. గిరిజనులు నటులె యుండిరి
సరిపడునే రామరాజు స్వాంతనంబెందున్
దరి శాంతిని గొను తాతకు
సరిహద్దులలోని పోరు సంతోషంబే.

**27. మా శర్మ గారు**

**ఆశువులో కవిత్వాంశం**

కం. మానసజవమునుఁ బూనుచుఁ
బ్రాణమ్మును రసముఁ జేసి పలికినయేనిన్
దేనెలు పలుకును పలుకున,
లోనన్ లేనట్టి కవితలున్ బయలగునే?

## ఆశువులు (సంస్కృతం)

28. పీ.టీ.జీ. రంగాచార్య స్వామి గారు

**భారతే అసహిష్ణుతా**

सहते पृथिवी प्रजास्समाः
क्षमते वारिधिरौर्वपावकम् ।
ध्रियते च पिकः परैर्द्विजैः
बत नृणामिह निस्सहिष्णुता ॥

29. అవధాని శ్రీ ముదిగొండ అమరనాథ శర్మ గారు

**లక్ష్మీనరసింహుని వర్ణన సంస్కృతములో**

आनाभिप्रकटीभवद्द्रुहिणसद्भावो तदूर्ध्वस्थली
श्रीवत्साञ्चितवैजयन्तसुमसद्गन्धाकृतौ वैष्णवः ।
त्रैयक्षभ्रुकुटीमिलद्धुहुरटद्धर्यक्षगर्जोग्रता
रुद्रो वैद्युतकीलिकावलयितः स्तम्भोद्भवो नः प्रभुः ॥

30. కాసుల రాధాకృష్ణ గారు

**కరోనా సమయములో జరిగిన మంచి కార్యముల వర్ణన సంస్కృతములో**

भवति करोनाकाले
जालीकृतमाध्यमैकमध्यस्था ।
अमिलितदूरसभेया
वितिरोहितकण्ठतोऽधराकारा ॥

31. మేడ్లూరి సూర్యనారాయణ శర్మ గారు

**సంస్కృతములో "చూపే బంగారమాయెనె శ్రీవల్లీ" అని సుబ్రహ్మణ్యుడు వల్లీదేవితో సంభాషణ**

नेत्राणि मम मयूरे
शतशो विकसन्ति मां च पश्यन्ति ।
पद्मविजेत्रे नेत्रे
ते मे सन्दर्शनाय बत विमुखे ॥

32. చింతపల్లి స్వరూప గారు

**"అష్టవర్షే భవేత్కన్యా..." అను ధర్మవాక్యమునకు ఆధునిక కన్యదానమునకు సంస్కృతములో సమన్వయం.**

लक्षणागतिको नूनं कन्याशब्दस्समन्वयात् ।
पवित्रता हि कन्यया: सैवास्याश्च समीरिता ॥

33. తాండ్ర సాయి

**అధునిక కాలములో సంస్కృతాధ్యయనము యొక్క ఆవశ్యకత - సంస్కృతములో**

वश्या वाणी यदाऽऽवश्या तदोपास्या हि भारती ।
कृतकृत्यत्वमिच्छद्भिरध्येतव्यं हि संस्कृतम् ॥

34. త్రిగుళ్ళ రామగీత గారు

**సంస్కృతభాషావైశిష్ట్యము - సంస్కృతంలో**

वैपुल्यं काव्यजातेषु गाम्भीर्यं शास्त्रविस्तरे ।
तादात्म्यं वेदनादेषु विद्यते संस्कृते भृशम् ॥

35. సి.బి. రామ శర్మ గారు

**ప్రభుత్వముచేత పొండితీసత్కృతి - సంస్కృతంలో**

मोदिना मोदते चान्द्रमेदिनी मधुमेधुरा ।
प्रभुत्वेन प्रभात्वेन प्रभातादित्यता भवेत् ॥

36. ఇంద్రకంటి శ్రీప్రద

**శాస్త్రీయ - ఆధునిక - ఆహారవిధాన సమన్వయము - సంస్కృతంలో**

पाकजं च यदुष्णत्वं पाश्चात्यान्नेषु दृश्यते ।
सांसिद्धिकं रसत्वं च भारतीयेषु दृश्यते ॥

'శతావధానశతధృతి'

# గన్నవరం లలితాదిత్య

శ్రీమతి, శ్రీ శైలజ, మారుతి శశిధర్ దంపతుల పుత్రులు. సెప్టెంబరు 23, 2000లో New York లో జన్మించారు. University of Texas లో 'Aerospace Engineering'లో BS మరియు సంస్కృతములో BA లను పూర్తిచేసి, కౌటిల్యుడి అర్థశాస్త్రములో పర్యావరణసంరక్షణపై thesis చేసి, ప్రస్తుతం శృంగేరిలో జగద్గురువుల సన్నిధిలో వేదాంతశాస్త్రాధ్యయనం కొనసాగి స్తున్నారు.

శృంగేరిజగద్గురువులకు విధేయుడై, వారి ఆశీరనుగ్రహాలతో తర్కము, వేదాంతము, వ్యాకర ణము, మొదలైన శాస్త్రముల అధ్యయనమును ''దర్శనాలంకార'' శ్రీ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి గారు, శ్రీవెంపటి కుటుంబశాస్త్రి గారు, శ్రీచిఱ్ఱావూరి పద్మనాభశర్మ గారు, వంటి పండితుల వద్ద కొనసాగించారు. వీరి అవధానగురువులు ''అవధాన ప్రాచార్య'' శ్రీధూళిపాళ మహాదేవమణిగారు.

19 సంవత్సరాల వయసున రాజమహేంద్రిలో మొదటి శతావధానము నిర్వహించి అటుపైన భాగ్యనగరములో, శ్రీకాకుళములో కూడా శతావధానములను సంపన్నము చేసారు. రవీంద్రభారతిలో ద్విగుణిత ద్విభాషాష్టావధానము, నల్లకుంట శంకరమఠము(హైదరాబాద్), సైనిక్ పురీ శంకరమఠము, రామకోటి శంకరమఠము(విజయవాడ) ఇత్యాది ప్రాంగణాలలో, అమెరికా, కెనడా, భారతదేశాలలో 18కి పైగా అష్టావధానాలు నిర్వహించారు.

భాగవత-రామాయణ-గీతాదులపై శంకరదిగ్విజయాదులపై వివిధ-ఆధ్యాత్మికాంశాలపై వీరు 100పైగా ప్రవచనాలు చేశారు.

జగద్గురు శ్రీ విధుశేఖరభారతీ స్వామివారి ఆదేశముప్రకారము శృంగేరీశారదాపీఠానికి 33వ అధిపతులైన జగద్గురు శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహభారతీ మహాస్వామివారి జీవితచరిత్రను ''అభినవశంకరవిజయము'' అనెడి ఒక మహాకావ్యముగా విరచించారు.

నారసింహనమశ్శతం (సంస్కృతం), నఖశతకం (సంస్కృతము - నృసింహుని నఖములను 108 శ్లోకాలలో కీర్తిస్తూ), హనుమద్దోర్దండశతకము (తెలుగు) మొదలైన రచనలు చేసారు.

## గన్నవరం లలితాదిత్య

సీ. ఆర్యకోటి నుతింప అభినవ శంకర
విజయము రచియించి వినుతి గాంచె,
సరవి ఆవిర్భావ సత్కావ్యము రచించె
ధృతి నఖ శతకమ్ము కృతిగ నొసగె,
జ్ఞానేచ్ఛ నుపదేశ చంపూః మహాకృతిన్
సంస్కృత భాషలో సంతరించె,
శ్రీరామ షోడశిన్ చిరు పొత్తముగ వ్రాసె
శ్రీ జగద్గురుల ఆశీస్సులందె,
తే.గీ. అరయ అవధాన మణులలో ఆద్యుడౌచు
శతవధాన శతధృతి ప్రశస్తి గాంచె,
గన్నవర వంశమందున మిన్నయైన
అమృతగుణు లలితాదిత్యు నాత్మనెంతు.

**శతావధాని మద్దూరి రామమూర్తి**

# ఆహూతులను తన్మయులను చేసిన శతావధానం

యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడి భారతీయ సాంప్రదాయాలను మంటగలుపుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాలో పుట్టి, అమెరికా పౌరుడై ఉండి, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదువుతూ కూడా మన భారతీయ సంస్కృతిని నిలబెట్టడంకోసం ఎంతో కృషి చేస్తూ అవధాన ప్రక్రియను దశదిశలా చాటుతున్న శతావధాని లలితాదిత్య భరతజాతి గర్వించదగిన వ్యక్తుల్లో ఒకరని చెప్పవచ్చు. శృంగేరీ జగద్గురువులు పరమపూజ్య భారతీతీర్థ స్వామివారి వద్ద శిష్యరికం చేస్తూ శారదాంబ అనుగ్రహంతో నేను సైతం అంటూ సంస్కృతాంధ్ర భాషలలో శతావధానం చేయడం స్ఫూర్తిదాయకం. విద్యావంతులు ఎందరున్నా అందులో పండితులు అతి కొద్దిమంది మాత్రమే ఉంటారు. అలాంటి వెయ్యిమంది పండితులలో ఒక్కడు కవీశ్వరుడు ఉంటాడని, అలాంటి కవీశ్వరులలో నూటికి ఒకడు అవధానిగా ఉంటారన్న తిరుపతి వేంకట కవుల పద్యాన్ని నిజం చేస్తూ లలితాదిత్య కోటి కొక్కడుగా వెలుగొందుతున్నాడనడంలో అతిశయోక్తి లేదు.

ఇలాంటి శతావధాని గన్నవరం లలితాదిత్య నిర్వహించిన శతావధానం పండిత, పామరులను అబ్బురపరచింది. ఈ సందర్భంగా నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో మూడురోజుల పాటు జరిగిన గన్నవరం లలితాదిత్య శతావధానం దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా పరిషత్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి మాట్లాడుతూ శతావధాని లలితాదిత్య పద్యాలను, శ్లోకాలను అప్పచెప్తుంటే ఎంతో అబ్బురపడ్డానని, 32 నిముషాలలో ధారణ చేయడం చూస్తున్నప్పుడు ఒక్కొక్క పదాన్ని అవధాని పలుకుతున్న తీరు చూసి తనకు కళ్లల్లో నీళ్ళు వచ్చాయని ప్రశంసించారు. ఆయనను 'శతావధాని శతధృతి' బిరుదుతో సత్కరించారు. దుశ్శాలువా, గజమాల, ముత్యాలహారం, జ్ఞాపిక, తలపాగా, సన్మానపత్రాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రమణాచారి మాట్లాడుతూ ఈ అవధానంలో పాల్గొన్నంతసేపు తన మనసు పులకించి పోయిందన్నారు.

తెలంగాణ శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి మాట్లాడుతూ... ఇంతమంది అవధానులమధ్య మాట్లాడడమంటే తాను సాహసం చేస్తున్నట్టేనని

అంటూ... అవధానానికి తెలుగుభాషలో ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందని, బి.ఏ.లో తెలుగు చదివిన తనకు అవధానం అంటే చాలా ఇష్టమని అన్నారు. అష్టావధానం, శతావధానం, సహస్రావధానం మొదలైన ప్రక్రియలను నిర్వహించడమంటే అద్భుతమని అన్నారు. తన కుమారుని వయసు ఉన్న అవధాని సరస్వతీ పుత్రుడని, అమెరికాలో ఉంటూ, అంతరిక్ష జ్ఞానాన్ని అభ్యసిస్తూ కూడా ఇలాంటి శతావధానాన్ని చేయడమంటే అత్యద్భుతమని, ఈ యువ అవధానికి ఆకాశమే హద్దని ప్రశంసించారు. యూ ట్యూబ్‌లోనూ, సాంకేతిక తెరలలోనూ మునిగి ఉండే ఈ తరం పిల్లలకు స్ఫూర్తినిచ్చేలా ఈ శతావధానం సాగిందని అన్నారు. ఈ శతావధానం వల్ల సారస్వత పరిషత్ పేరు సార్ధకమైందని, అనేకమంది పూర్వ అవధానులను స్మరిస్తూ వారి పేర్లను పలు వేదికలకు ఉంచడం ఎంతో స్ఫూర్తిదాయకమని అంటూ భవిష్యతులో ఇటువంటి కార్యక్రమాలకు జనం తండోపతండాలుగా రావాలని అన్నారు. ఈ సందర్భంగా నభూతో న భవిష్యతి అన్న రీతిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన దర్శనమ్ పత్రిక అధినేతలు మరుమాముల సోదరులు వెంకటరమణ శర్మ, దత్తాత్రేయ శర్మలను అభినందించారు.

మరో తెలంగాణ శాసనమండలి సభ్యులు కూర రఘోత్తం రెడ్డి మాట్లాడుతూ... లలితాదిత్య ధారణాప్రతిభను చూసి తనను తాను మరిచిపోయానని, తన్మయత్వం చెందానని, ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టమని అన్నారు. చిన్నవయసులోనే ఇంతటి ప్రతిభను ప్రదర్శించిన లలితాదిత్య అష్టావధానం అంటే ఏమిటో తెలియని నేటి పిల్లలకు ఆదర్శమని, తల్లిభాషను ఏవిధంగా కాపాడుకోవాలో ఆచరించి చూపించారని అన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి వనం జ్వాలానారసింహారావు మాట్లాడుతూ 22 ఏళ్లకే అమెరికాలో ఉంటూ కూడా శతావధానం చేయడం అంటే చాలా శ్రమించి ఉంటారని, అలాంటి లలితాదిత్య వందల వేల మంది లలితాదిత్యలను తయారు చేయాలని అభిలషించారు.

శతావధాన సంచాలకులు శ్రీరంగాచార్య మాట్లాడుతూ.. ఈ అవధానం తెలుగువారి పురాకృత పుణ్యవిశేషంగా భావిస్తున్నానని, అంతరించిపోతున్న తెలుగు భాషా గౌరవాన్ని పునరుద్దీపితం చేసే విధంగా అవధానం సాగిందని అన్నారు.

గన్నవరం లలితాదిత్య అవధాన గురువులు ధూళిపాళ మహదేవమణి మాట్లాడుతూ శతావధానం చేయడమంటే మాటలు కాదని, అలాగే నిర్వహించడమంటే మరింత కష్టమని అందుకు దర్శనమ్ సోదరులు మరుమాముల వెంకటరమణ శర్మ, మరుమాముల దత్తాత్రేయశర్మలను అభినందిస్తున్నానని అదే విధంగా రమణాచారి ధారణసభకు ముందే విచ్చేసి అవధానం పట్ల తమ మక్కువను ప్రదర్శించడం గొప్ప విషయమని కొనియాడారు.

ఈ విజయోత్సవ సభలో వేలేటి మృత్యుంజయశర్మ, బగళాముఖీ పీఠాధిపతులు శాస్త్రుల వేంకటేశ్వర శర్మ, వేదపండితులు జనమంచి సీతారామశర్మ. పి.వి. మనోహరరావు, డీ.టీ.వో. హైదరాబాద్, పసర్ల శ్రీవల్లి సుబ్బలక్ష్మి, శంకరమఠం ధర్మాధికారి కృష్ణారావు, అవధాని సురభి శంకరశర్మ, రంగి సత్యనారాయణ, దర్శనమ్ ప్రధాన సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ, తెలంగాణ గురుకుల పాఠశాలల విశ్రాంత ప్రధానాచార్యులు మరుమాముల దత్తాత్రేయశర్మ, 8 మంది శతావధానులు డా. దోర్బల ప్రభాకరశాస్త్రి, డా. జి.యం. రామశర్మ, ధూళిపాళ మహదేవమణి, డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, గండ్లూరి దత్తాత్రేయశర్మ, ఆముదాల మురళి, రాంభట్ల పార్వతీశ్వర శర్మ. ఐతగోని వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు సి.వి.సుబ్బన్న వేదికగా జరిగిన శతావధాన ధారణ సభలో అవధాని గన్నవరం లలితాదిత్య... 3 నిషిద్ధాక్షరి పూరణలు, 24 సమస్యా పూరణలు, 24 దత్తపది పూరణలు, 24 వర్ణన పద్యాలను మొత్తం 76 పద్యాలను 32 నిముషాల 15 సెకెన్లలో ఏ మాత్రం తడుముకోకుండా పూర్తి సాధికారికతతో అత్యంత వేగవంతంగా ధారణ చేశారు.

## లలిత పరిమళం... ఆదిత్య ప్రకాశం

## అపూర్వ ప్రదర్శనం సంస్కృతాంధ్ర శతావధానం

నాటి భువనవిజయ సభను తలపించే సారస్వత వేదిక... ఎటు చూసినా ఉద్దండులైన పండితులు, సంప్రదాయ దుస్తుల్లో సాహితీ రసజ్ఞులు, అవధానంలో ఆరితేరిన ప్రజ్ఞానులు, శరపరంపరగా సంధించిన పద్యాస్త్రాలకు ఆనందాశ్చర్యాలను కలిగించే పద్యసుమపరిమళాలు పరివ్యాప్తమైన ఘట్టం. మూడు రోజులు మూడు ఘడియలుగా గడిచిందా అన్న రీతిలో సాగింది ఆ సాహితీ మహోత్సవం. సప్తసముద్రాల ఆవల పాశ్చాత్య దేశంలో జన్మించినా స్వదేశాభిమానం, అంతకుమించి మాతృభాషపై మమకారం కలిగి సంస్కృతాంధ్ర భాషల్లో అపార పాండితీ ప్రకర్షను సాధించి ప్రపంచ తెలుగు సమాజానికి ధీరోదాత్త వారసుడిగా నిలిచిన గన్నవరం లలితాదిత్య శతావధాన ప్ర'దర్శనమ్' నభూతో...గా సాగింది. జూన్ 28 నుంచి 30 దాకా మూడు రోజులపాటు భాగ్యనగరం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ దేవులపల్లి రామానుజరావు కళామందిరం ఈ అద్భుత సాహితీ సంరంభానికి వేదిక అయింది.

ఎటు చూసినా పండితులు... జరీ ధోవతులతో, అంచు కండువాలతో తిరుగుతున్నారు. గొంతు విప్పారా, సాదాసీదాగా ఉన్న కవివర్యులు కంచుకంఠంతో ఖంగున సుస్వరాల పద్యాల విరిజల్లులు కురిపిస్తున్నారు! కోడలు సరస్వతి అట్టహాసాన్ని చూస్తూ, లక్ష్మీదేవి ఈర్ష్యతో, కొంచెం మూతి ముడుచుకున్నదా అన్నట్లు ఉన్నది అక్కడ. ఎక్కడా ఆడంబర శషభిషలు లేవు మరి! ఆ సభా ప్రాంగణంలో తెలుగు భాషామాత, సంస్కృత భాషాజనని చెట్టాపట్టాలేసుకుని, పట్టు పీతాంబరాలు ధరించి, సర్వాలంకార భూషితులై, చేతిలో కవిత్వామృత భాండాన్ని పట్టుకుని తమ బిడ్డలు, సారస్వతమూర్తులని ముద్దుగా మురిపెంగా చూసుకుంటూ కవితామృతాన్ని పంచుతూ అక్కడే తిరుగుతున్నారా అన్నట్టుగా ఉన్నది. మధ్యలో సరస్వతిదేవి పులకితాంతరంగితయై, ఆనంద పరవశాలతో సభలోని తన బిడ్డలని చూసుకుంటూ తన్మయావస్థలో ఉన్నదా అనిపించింది.

'శతావధాన శరశ్చంద్ర, శతావధాని శతధృతి' గన్నవరం లలితాదిత్యచే సంపూర్ణ సంస్కృతాంధ్ర శతావధానం జూన్ 28, 29, 30 తేదీల్లో తెలంగాణ సారస్వత పరిషత్తులోని శ్రీ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో

అద్వితీయంగా జరిగింది. దర్శనం శర్మగా వ్యవహరించబడుతున్న ప్రముఖ పాత్రికేయులు, మరుమాముల వెంకటరమణ శర్మ ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారు. వారికి అన్ని విధాల చేదోడు వాదోడుగా వారి సోదరులు, గురుకుల విద్యాలయాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మరుమాముల దత్తాత్రేయ శర్మ ఈ సారస్వత యజ్ఞాన్ని సమర్ధవంతంగా నిర్వహించటానికి పాటుపడ్డారు.

లలితాదిత్య ధారణ ప్రజ్ఞ గురించి, అమెరికాలో పుట్టి పెరిగి, ఆన్ లైన్ మాధ్యమం ద్వారా తెలుగు, సంస్కృత భాషలనధ్యయనం చేసి, అవధానాలు చేస్తున్న ఆయన ప్రతిభ గురించి తెలుసుకొన్నారు వెంకటరమణ శర్మ. మన దేశంలో యువతకు కూడా లలితాదిత్యను పరిచయం చేయగలిగితే అది భావితరానికి, అవధానం చేయదల్చుకున్న యువకులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని సంకల్పించారు. లలితాదిత్యని భారతదేశానికి ఆహ్వానించి ఈ కార్యక్రమం జరపడానికి రూపకల్పన చేశారు. గతంలో లలితాదిత్యతో రవీంద్ర భారతిలో ద్విగుణిత అష్టావధానం, శృంగేరీ శంకరమఠాల్లో రెండు అష్టావధానాలు, ఆన్‌లైన్‌లో సంస్కృత అష్టావధానం నిర్వహించగా, విశేష ఆదరణ లభించింది.

28వ తేదీ మంగళవారం లలితాదిత్య శతావధానం ప్రారంభమైంది. ఆ రోజు తెలంగాణ సారస్వత సభాప్రాంగణం కళ్యాణ శోభతో కళకళలాడిపోయింది. పండితులు, శతావధానులు, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఈ సభలో పాల్గొనటానికి వచ్చారు. మొదటిరోజు ప్రారంభసభ ఎంతో అట్టహాసంగా పలువురు పెద్దల సమక్షంలో జరిగింది. ప్రారంభవేదికకు 'కోలాచల మల్లినాథ' వేదికగా నామకరణం చేశారు. ఆర్యులు 'ధారణ బ్రహ్మరాక్షసులు', పద్మశ్రీ పురస్కృతులు డా. గరికపాటి నరసింహారావు, తెలంగాణ రాష్ట్ర సలహాదారు డా. రమణాచారి, సుప్రసిద్ధ సినీనటులు తనికెళ్ల భరణి మొదలగు పెద్దలతో సభా ప్రారంభం వైభవంగా జరిగింది. అదేరోజు భారతపూర్వ ప్రధాని పి.వి నరసింహారావు జన్మదిన సందర్భంగా పీవీ చిత్రపటాన్ని పుష్పమాలతో అలంకరించారు.

దత్తాత్రేయ శర్మ సభాకార్యక్రమాన్ని నిర్వహించారు. గంటి నగేష్ శంఖనాదంతో సభకి నాంది జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులుగా 'శతావధాని పంచానన' డా. జి.ఎం. రామశర్మ వ్యవహరించారు. మూడు రోజుల శతావధానానికి సంచాలకులుగా విశ్రాంత ప్రధానాచార్యులు, ఉభయ భాషా పండితులు శ్రీరంగాచార్య సభను నడిపించారు.

గరికపాటి నరసింహారావు సభలో మాట్లాడుతూ అవధానికి ధారణతో పాటు ధైర్యం కూడా ఉండాలని అన్నారు. ధైర్యం లేకపోతే ఎంత పాండిత్యం ఉన్నా ఉపయోగముండదని చెప్పారు. అష్టావధానం కష్టం, శతావధానం మరీ కష్టమని అన్నారు. సహస్రావధానం అపూర్వమని అన్నారు. క్రికెట్ వంటి క్రీడలు కూడా అవధానం ముందు తీసికట్టేనని చెప్పారు. అవధానం కూడా యుద్ధం వంటిదేనని, అవధాని విమర్శలకు, ప్రశంసలకు లొంగిపోరాదని అన్నారు.

శతావధాన కార్యక్రమానికి శుభారంభం చేస్తూ శతావధాన సారధ్య సంఘం అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ అమెరికాలో ఉంటూ, ఇంజనీరింగ్ చదువుతూ కూడా మన భారతీయ సంస్కృతిని నిలబెట్టడం కోసం, శృంగేరి జగద్గురువులు పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ భారతీతీర్థస్వామి వారి వద్ద శిష్యరికం చేస్తూ, శారదాంబ అనుగ్రహంతో నేను సైతం అంటూ సంస్కృత ఆంధ్ర భాషలలో శతావధానం చేయటం స్ఫూర్తిదాయకమని అన్నారు. లక్షమందిలో పండితుడనేవాడు ఒక్కడే ఉంటాడని, అలాంటి వెయ్యి మంది పండితులలో ఒక్కరు కవీశ్వరుడు అవుతాడని, అలాంటి కవీశ్వరులలో నూటికి ఒక్కరు అవధానిగా ఉంటారన్న తిరుపతి వెంకటకవుల పద్యాన్ని గుర్తు చేశారు.

ప్రముఖ రచయిత, సినీనటులు, దర్శకులు తనికెళ్ళ భరణి అవధానిని శాలువాతో సన్మానించి శుభాశీస్సులు అందించారు. ఆయన ప్రసిద్ధ 'యాస్య త్యద్య శకుంతలేతి హృదయం...' అనే కాళిదాసు శ్లోకానికి తెలుగులో పద్యం అడుగగా అవధాని సరళ సుందరమైన తెలుగులో అప్పటికప్పుడు అనువదించి పద్యం చెప్పారు. మాడభూషి వెంకటాచార్య వేదికగా జరిగిన సభలో మూడు నిషిద్ధాక్షరి, 24 సమస్య పూరణలు, 12 దత్తపదులు, ఐదు ఆశువు అంశాలలో ప్రేక్షకులు సంస్కృతాంధ్ర భాషలలో ప్రశ్నలు సంధించగా, నిషిద్ధాక్షరిలో రెండు పాదాలు, సమస్య పూరణలో ఒక పాదం, దత్తపదులలో రెండు పాదాలను చెప్పారు. మిగతా పాదాలను మరుసటి రోజు పూరించారు.

వీక్షించటానికి వీలుగా బయట కూడా, ఒక ఎల్ఇడి తెర ఉంచారు. ఎంతోమంది, పండిత మిత్రులు, గురుతుల్యులు అక్కడ ఆసీనులై, ఒకరి నొకరు పలకరింపులు, పరామర్శలతో సందడి చేస్తున్నారు. ఇంతలో వర్ణన అంశం మొదలైంది. 'వర్ణన నిపుణః కవిః' అంటారు, అవధానం యోగవిద్య, ఒక

మనోయోగి విద్య అని అంటూ మరుమామల దత్తాత్రేయ శర్మ పృచ్ఛకులందరినీ తిరుపతి వేంకటకవుల వేదిక మీదకి ఆహ్వానించారు.

వేదిక మీద లలితాదిత్య యోగి లాగా కూర్చుని ఉన్నారు. చెదరని చిత్తాన్ని గుప్పిటపట్టి, చక్కటి పూరణలను ప్రాశ్నికులకు చకచకా మెరుపువేగంతో అందిస్తున్నారు. సామాన్యంగా చిన్నపిల్లల్ని చూడంగానే బుగ్గ గిల్లి వాళ్లు బుంగమూతి పెడితే నవ్వుకుంటుంటాం. అదే వయసులో ఉన్న పిల్లలు ఎదురైతే ఖచ్చితంగా పెళ్లి గురించే మాట్లాడుతుంటాం. పప్పన్నం ఎప్పుడు పెడతావు అనే జాతీయాన్ని ఆధారం చేసుకుని వర్ణనాంశం ఇచ్చారు. మానిని వృత్తం అనే ఛందస్సు కూడా నిర్దేశించారు. ఆ ప్రశ్న వినగానే దీర్ఘాలోచనలో మునిగి గంభీరంగా ఉన్న లలితాదిత్య మొహంలో చిరు సిగ్గుతో కూడిన ఆహ్లాదకరమైన మందహాసం చిగురించింది. అది చూడాలనే అడిగిన వారి కోరిక. చుట్టూ ఉన్న పెద్దలందరూ కూడా ముసిముసి నవ్వులతో అవధాని పూరణ కొరకు ఎదురు చూస్తున్నారు.

''ఇందరు చూడగ నిట్టి సభాస్థలి నేమని చెప్పుదు దానివడిన్'' అంటూ ముసి ముసి సిగ్గుల నవ్వులతో మొదటి పాదాన్ని పూరించారు అవధాని గారు. రెండు గంటల సమయం ఎలా గడిచిపోయిందో తెలియలేదు. చక్కటి అంశాలని ప్రాశ్నికులు ఇవ్వడం, అవధాని వాటికి సరైన రీతిలో చక్కటి సమాధానాలు ఇవ్వటంతో నయనాందకరంగా, శ్రవణానందకరంగా సాగిపోయింది. తొలి రోజు ముగింపు సభలో అష్టావధాని ధూళిపాళ మహదేవమణి, గన్నవరం లలితాదిత్య అవధాన ప్రస్థానాన్ని వివరించారు. ఇంకా ఈ సభలో సంస్కృత శతావధాని దోర్బల ప్రభాకరశర్మ, అచ్చతెలుగు శతావధాని కుదురాటగండ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, శతావధాని రాంభట్ల పార్వతీశ్వర శర్మ, అమెరికా కాలిఫోర్నియా నివాసులైన అష్టావధాని మైలవరపు సాయికృష్ణ, అమెరికా నివాసులు ఇంద్రగంటి వెంకట్ పాల్గొని అవధానిని అభినందించారు. ఆరోజు ముగింపు సభలో శతావధానులందరూ సారస్వత విజ్ఞానం జాలువారు ప్రసంగాలతో మొదటిరోజు కార్యక్రమాన్ని మరింత సుసంపన్నం చేశారు.

29వ తేదీన వేదిక మీద శతావధాని లలితాదిత్య, వారి పక్కన సంచాలకులు, మరొక పక్క వారి గురువులు వేదికపై ఆశీనులై ఉన్నారు. ఎదురుగా ప్రథమ స్థానంలో అప్రస్తుత ప్రాసంగీకులు ఉపవిష్టులై, వారి పాత్రను యథోచితంగా నిర్వహించారు. నిషిద్ధాక్షరి పూర్తయింది. సమస్యలు, దత్తపదులు

జరుగుతున్నాయి. ఒక్కొక్క అంశానికి 24 మంది ప్రాశ్నికులు ఉన్నారు. అందులో నలుగురు సంస్కృత భాషకు సంబంధించిన వారు. భోజన సమయానికి సమస్యలు మాత్రం పూర్తయ్యాయి.

రెండవ రోజు ఉదయం సభ కొప్పరపు కవుల వేదికగా వ్యవహరించారు. ఆనాటి గౌరవ అతిథి శతావధాని, కుదురాటగండ డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్. మధ్యాహ్నవేదికను సిరిసిన హల్ కృష్ణమాచార్య వేదికగా వ్యవహరించారు. ఆ సభకు గౌరవ అతిథి డా. ధూళిపాళ మహదేవమణి. రెండవ రోజు మధ్యాహ్నం వరకు తెలుగు, సంస్కృతాలలో సమస్యలు అన్ని పాదాలు పూర్తయి, ఆశువులు ఆరు, తరువాత దత్తపదులు 24 పూర్తయ్యాయి. ఎక్కువ శాతం కంద, పంచచామరాలలో పూరణలు ఉండటం విశేషం. మధ్యాహ్నసభను తిరుపతి వెంకట కవుల వేదికగా నిర్వహించారు. రెండవ రోజున అవధాన ప్రక్రియలో మంచి విరుపులు, మెరుపులతో అద్భుత అప్రస్తుత ప్రసంగం మరింత లాలనగా హాస్యం పండిరచడంతో రసరమ్యంగా సాగింది. అప్రస్తుత ప్రాసంగీకులు రంగి సత్యన్నారాయణ, సభను రసవత్తరంగా ఉంచడంలో వారి పాత్రను సముచితంగా పోషించారు. వింత ఏముంది! ఆ ప్రాంగణంలో ఉన్న వారందరూ కూడా ఉద్దండులు! ఘనపాఠీలు.

ఆ రోజు వర్ణనాంశం సభకి విశిష్ట అతిథిగా డా. కేవీ రమణచారి ఉన్నారు. కాలాతీతం అవటం మూలాన మరియొక పాదం మాత్రం పూరించి సభని వేగంగా నడిపించారు. మూడవరోజు ఉదయం నాటికి మిగిలిన రెండు పాదాలు పూర్తి చేయటానికి నిర్ణయించారు. ఆనాటి సభలో విశిష్ట అతిథులగా విచ్చేసిన ఉస్మానియా యూనివర్సిటీ కులపతి ఎస్వీ రామారావు, డా. సాయి కమలాకర్ శర్మ, ఘట్టి కృష్ణమూర్తి, రేమెళ్ల అవధానులు తదితరులను సన్మానించారు.

మూడవరోజు సభకు విఠాల చంద్రమౌళి శాస్త్రి వేదికగా నామకరణం చేశారు. ఆనాటి గౌరవ అతిథిం శతావధాన శిరోమణి గండ్లూరి దత్తాత్రేయ శర్మ. ఈ వేదికలో వర్ణనాంశాలకు పూరణలు పూర్తి చేశారు. కాబోయే వధువు గురించి మానినీవృత్తంలో అంతే చమత్కారంగా పూరిస్తూ కాబోయే వధువుగురించి చెప్పటం నన్ను చాలా ఇబ్బందికి గురిచేసింది అన్నారు అవధానిగారు! ఆ ఇబ్బందిని బానే ఆస్వాదించినట్టు అవధాని ముఖంలోని నునుసిగ్గుల చిరుమందహాసం చూస్తుంటే అందరికీ అనిపించింది!

**"ఇందరు చూడగ నిట్టి సభాస్థలి నేమని చెప్పుదు దాని వడిన్**
**మందముగా తన కర్ణము నందున మాటున చెప్పెడి మాట యిదే**
**ఇందువతంసుఁడు నద్రిభవేశ్వరుఁడేమని యానతి సేయునొకో**
**అందిన వెంటనె పద్యము సెప్పెద నందెడి దాఁకను వేఁచుమిటన్!"**

"మా నాన్న పేరు మారుతి శశిధర్, మాఅమ్మ శైలజ. వారి అభిప్రాయమే ఆచరణ యోగ్య"మని అందంగా జెప్పి, యెంతో యోగ్యమైన పూరణ జేయటంతో వీక్షకులకు బాగా నచ్చింది! తండ్రిచాటు బిడ్డ అని అందరూ ముద్దుగా చమత్కరించారు! సభంతా నవ్వులతో నిండింది.

తరువాత పూరణలు నల్లేరు బండి మీద నడకలాగా అయ్యాయి. మధ్యాహ్న సభ సివి సుబ్బన్న వేదిక. శతావధాని ఆముదాల మురళి అవధాన ప్రక్రియ గురించి చాలా అద్భుతమైన ప్రసంగం చేసారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రాశ్నికుల స్పందన కార్యక్రమాన్ని కంది శంకరయ్య, దోర్బల ప్రభాకర్ శర్మ అత్యద్భుతంగా నిర్వహించారు. పృచ్ఛకులందరూ తమ ప్రశ్నలను, దానికి అవధానిగారు చేసిన పూరణలను వినిపిస్తూ, అద్భుతమైన ప్రశంసాపూర్వక పద్యాలను శతావధాని లలితాదిత్య మీద గుప్పించారు.

తర్వాతి అద్భుత ఘట్టం శతావధాని ధారణ సమయం. గౌరీభట్ల గుమ్మన గారి వేదికగా ధారణ సభ, సమాపనోత్సవాలు జరిగాయి. కాసుల సువిధ ప్రార్థనతో ధారణాసభ ప్రారంభమైంది. శతావధాని చిరంజీవి లలితాదిత్య అలౌకికమైన ఒక యోగస్థితిలో ఇష్టదేవతా ప్రార్థన చేశారు. సభానిర్వాహకులు దత్తాత్రేయ శర్మ ఘట్టం గాంభీర్యాన్ని, ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ చక్కటి వ్యాఖ్యానాన్ని అందించారు. సభంతా సూది పడితే వినపడేంతటి నిశ్శబ్దం ఆవరించింది. లలితాదిత్య ఎదురుగా వారి గురువులు ధూళిపాళ మహదేవమణి అంతే గాంభీర్యంతో కూర్చుని ఉన్నారు. డా. కేవీ రమణాచారి కూడా ఉత్కంఠతో ధారణ కార్యక్రమాన్ని వీక్షించటానికి సతీసమేతంగా విచ్చేసి కూర్చుని ఉన్నారు. వేదికమీద నుంచి దత్తాత్రేయ శర్మ ఒకటి రెండు అని అంకెలు చెప్పటం, లలితాదిత్య టకటక పద్యాలను ధారణ చేయటం, అందరూ చెవులు, కనులు, మనసు అన్నీ రిక్కించి, ఏకాగ్రతతో కదలకుండా కూర్చుని వీక్షిస్తున్నారు. సభికులందరూ ఉద్విగ్న మనస్కులై ఊపిరి బిగబట్టుకుని కూర్చున్నారు. అవధాని ఒక నిముషం ఆగితే ఆహుతులయినవారి గుండె చప్పుళ్ళు పైకి వినబడుతున్నాయి.

ఒక్కొక్క పద్యము అవధాని పూర్తి చేస్తుంటే  వింటున్న వారి కళ్ళల్లో ఆనందబాష్పాలు పెల్లుబికాయి. మనసులో అవధానిపైన  శతకోటి ఆశీస్సులు అందరూ వర్షిస్తున్నారు. సరిగ్గా 31 నిమిషాల 15 సెకండ్లలో ధారణ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి అయింది. సభ యావత్తూ హర్షాతిరేకంతో చప్పట్లు చరుస్తూ లేచి నిలబడ్డారు! కరతాళ ధ్వనులతో సభా ప్రాంగణం మారు మోగిపోయింది. అందరూ లలితాదిత్యకు జయోస్తు! జయోస్తు! అంటూ జయ జయధ్వానాలు చేశారు. అది ఒక చెప్పరాని వర్ణనాతీతమైన, హర్షభరిత తన్మయావస్థ!

తరువాత లలితాదిత్యకు సన్మానం అతి వైభవంగా జరిగింది. చక్కటి తలపాగా, గజమాల, ఎర్రటి దుశ్శాలువా, పైన చమ్కీ దండతో శతావధాని లలితాదిత్య పెండ్లి కొడుకులాగా, రాజకుమారుడిలాగా మెరిసిపోతున్నాడు. మొట్టమొదటిసారి తానున్న యోగస్థితి నుంచి బయటకు వచ్చిన, అతని ముఖంలో లౌకికమైన సాధారణ చిరుమందహాసం కనబడింది. ఆ తరువాత వరుసగా అతిథులు, ఆహూతుల ప్రశంసలు! ఆశీస్సులు!  ప్రసంగాలు! అది అంతా మామూలే.

అసమాన ద్విభాషా పాండిత్యంతో అత్యద్భుతమైన ధారణాశక్తితో, సద్యస్ఫురణతో శతావధానాన్ని దిగ్విజయంగా పూర్తి చేసిన గన్నవరం లలితాదిత్యను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా. కెవి రమణాచారి, గౌరవ శాసనమండలి సభ్యులు సురభి వాణీదేవి, కూర రఘూత్తంరెడ్డి, ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి వనం జ్వాలా నరసింహారావు, శతావధాన సంచాలకులు శ్రీరంగాచార్య, పివి మనోహరరావు,  దర్శనమ్ సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ, తెలంగాణ గురుకుల పాఠశాల విశ్రాంత ప్రధానాచార్యులు మరుమాముల దత్తాత్రేయ శర్మ, వేలేటి మృత్యుంజయ శర్మ, బగళాముఖీ పీఠం వ్యవస్థాపకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ, అష్టకాల రామ్మోహన్, వైష్ణవి ప్రసాద్, గుండా మల్లయ్య, రిజిస్ట్రార్ శ్రీమతి సుసర్ల సుబ్బలక్ష్మి, వేద పండితులు జనమంచి సీతారామశర్మ, కాసుల చంద్రశేఖర శర్మ, ఎనిమిది మంది శతావధానులు డా. దోర్బల ప్రభాకర శర్మ, డా. జి.ఎం. రామశర్మ, డా. ధూళిపాళ మహదేవమణి, డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, గండ్లూరి దత్తాత్రేయ శర్మ, ఆముదాల మురళి, రాంభట్ల పార్వతీశ్వర శర్మ, ఐతగోని వెంకటేశ్వర్లు, తదితరుల సమక్షంలో 'శతావధాని శతధృతి' బిరుదుతో ఆదిత్యను సన్మానించారు!

ఈ శతావధాన నిర్వహణ సంఘం గౌరవాధ్యక్షులుగా డా. కేవీ రమణాచారి వ్యవహరించగా, కమిటీలోని ఇతర ముఖ్యులైన ఉపాధ్యక్షులు డా. జి.ఎం. రామశర్మ, డా. శ్రీరంగాచార్య, బోర్పట్ల హనుమంతాచార్య, వైష్ణవీ ప్రసాద్, కార్యదర్శి మరుమాముల దత్తాత్రేయ శర్మ, కార్యనిర్వాహక కార్యదర్శి కంది శంకరయ్య, సహాయ కార్యదర్శులు కాసుల శ్యాంసుందర్, విట్టుబాబు, సంయుక్త కార్యదర్శులు మంచినీళ్ల సరస్వతీ రామశర్మ, బోచ్కర్ ఓంప్రకాశ్, సింగీతం నరసింహారావు, ఆరవల్లి శ్రీదేవి, ముఖ్య సమన్వయకర్త మరుమాముల వెంకటరమణ శర్మ, సమన్వయకర్తలు భీంసేన్ మూర్తి, గంటి నగేష్, మద్దికుంట శ్రీకాంత్ శర్మ, వెంకట్, బాలకిషన్ గుప్తా, తదితరులు ముఖ్యభూమిక నిర్వర్తించారు.

వైష్ణవి కేటరర్స్ వారు ఈ మూడు రోజులూ అందరికీ చక్కటి ఫలహారాలను, విందు భోజనాన్ని అందించారు. చివరిగా ప్రాశ్నికులను కూడా సత్కరించిన పిమ్మట అందరూ ఆనందభరిత హృదయాలతో ఇంటిదారి పట్టారు.